


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 313 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 19 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :313 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 19 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## రాష్ట్రానికి ఏం కావాలో పార్లమెంటు ద్వారా
# కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి
## టీడీపీ ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం



- రాష్ట్రాభివృద్ధికి నిధుల సాధనకు కృషి చేయాలని పిలుపు
- రాష్ట్ర ప్రాజెక్టులపై కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచన
- పార్లమెంటు సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీలకు నిర్దేశం

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ ఎంపీలకు సూచించారు. ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నాడు సీఎం చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి నారా లోకేశ్, ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... "పార్లమెంట్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు మద్ధతు ధర, నదీ జలాలు, పారిశ్రామికీకరణ వంటి అంశాలను పార్లమెంట్ లో లేవనెత్తాలి. ఆయా అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను వివరించడంతో పాటు కేంద్రం నుంచి ఆశిస్తున్న సాయాన్ని పార్లమెంట్ ద్వారా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు.

**మోదీ చేసిన మంచి పనులను సభలో ప్రస్తావించాలి**

"పార్లమెంట్‌లో మన ఎంపీల పని తీరు బాగుంది. క్రమం తప్పకుండా సమావేశాలకు హాజరవుతున్నారు. చర్చించే అంశాలపై రాష్ట్ర వాదనను సమర్ధవంతంగా వినిపిస్తున్నారు. పార్లమెంట్ సభ్యుల హాజరులో దేశవ్యాప్తంగా సగటున 85 శాతం ఉండగా టీడీపీ సభ్యులది 86.2 శాతం హాజరుతో అగ్రస్థానంలో ఉన్నారు. చర్చల్లో పాల్గొనడం, ప్రశ్నలు అడగటంలోనూ తెలుగుదేశం ఎంపీలు తొలి స్థానంలో ఉన్నారు. పార్లమెంట్‌లో రాష్ట్రానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించడంతో పాటు ప్రధాని మోదీ చేస్తున్న మంచి పనులను కూడా సభలో ప్రస్తావించాలి. సరైన సమయంలో సరైన వ్యక్తి ప్రధానిగా ఉన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో టెర్రరిస్టులకు గట్టి సమాధానం ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్, ఎమర్జెన్సీకి 50 ఏళ్లు వంటి అంశాలపై జరిగే చర్చలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును సమర్థించాలి" అని సీఎం సూచించారు.

**రాష్ట్ర సమస్యలపై నిరంతరం సంప్రదింపుల జరపాలి**

"ఎంపీలకు కొన్ని శాఖల వారీగా బాధ్యతలు అప్పజెప్పాం. మీకు కేటాయించిన విభాగాలకు సంబంధించిన సమస్యలు, పెండింగ్ అంశాలపై కేంద్రమంత్రులతో నిరంతరం మాట్లాడాలి... రాష్ట్ర యంత్రాంగంతోనూ సమన్వయం చేసుకోవాలి. నిరంతరం సంప్రదింపులు జరపడం వల్లే 'నరేగా'కు సంబంధించి రూ.180 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ బిల్లులను

వివరాలు 2లో..

---

## మామిడి రైతులకు చంద్రబాబు తీపి కబురు



- ఇచ్చిన మాట నిలుపుకున్న సీఎం చంద్రబాబు
- మార్కెటింగ్ సమస్యలతో సతమవుతున్న మామిడి రైతులకు ఊరట
- నిధులను తోతాపురి మామిడి కొనుగోళ్లకు ఉపయోగించనున్న వైనం

**పెన్ పవర్ డెస్క్:**చిత్తూరు జిల్లా మామిడి రైతులకు శుభవార్త! ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. చంద్రబాబు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మామిడి రైతుల కోసం రూ. 260 కోట్ల నిధులను విడుదల చేసింది. మార్కెటింగ్ సమస్యలతో సతమతమవుతున్న రైతులకు ఈ నిర్ణయం ఎంతో ఊరట కలిగించనుంది. ఈ నిధులను తోతాపురి మామిడి కొనుగోలు కోసం వినియోగిస్తారు. రోజుకు రూ.4 సబ్సిడీతో 6.5 లక్షల టన్నుల మామిడిని కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సబ్సిడీ మొత్తం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. రైతులు తమ ఖాతాలను తనిఖీ చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా కోరుతోంది. ఈ రూ.260 కోట్లు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) విధానం కింద పూర్తి సహాయం అందించాలని కేంద్రాన్ని కోరినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ చేసిన విజ్ఞప్తి మేరకు, కొనుగోళ్లు ఆగస్టు వరకు కొనసాగనున్నాయి. ప్రాసెసర్లు మామిడికి కిలోకు రూ.8 నుంచి రూ.12 చొప్పున మద్దతు ధర ఇవ్వాలని కూడా ప్రభుత్వం కోరింది.

వివరాలు 2లో..

---

### టీడీపీకి అశోక్ గజపతిరాజు
## రాజీనామా

- ఇటీవల అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియామకం
- టీడీపీ ప్రాథమిక సభ్యతం, పొలిట్ బ్యూరోకు, జీవితకాల సభ్యత్వంకు రాజీనామా
- దివంగత సీఎం ఎన్టీఆర్ హయాం నుంచి ఇప్పటి వరకు టీడీపీలో కొనసాగిన సీనియర్ నేత
- విజయనగరం నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా విజయం
- కేంద్రమంత్రిగా పనిచేసిన అశోక్ గజపతిరాజు



**పెన్ పవర్ డెస్క్:**టీడీపీకి కేంద్ర మాజీ మంత్రి, ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు రాజీనా మా చేశారు.

వివరాలు 2లో..

---

### నాపై నీచమైన వ్యాఖ్యలు
## చేసిన భానుపై చర్యలు తీసుకోండి

- రూ. 2 వేలు ఇస్తే ఏమైనా చేసేదని భాను అన్నారన్న రోజా
- వ్యాంప్ కు ఎక్కువ అని నీచంగా మాట్లాడారని ఆవేదన
- చర్యలు తీసుకోవాలంటూ మహిళా కమిషన్ కు ఫిర్యాదు



**పెన్ పవర్ డెస్క్:**నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ పై మాజీ మంత్రి రోజా జాతీయ మహిళా కమిషన్ కు, ఏపీ మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేశారు. రూ. 2 వేలు ఇస్తే రోజా ఏ పనైనా చేసేదని... అలాంటి రోజా ఇప్పుడు రూ. 2 వేల కోట్లు సంపాదించిందని తన గురించి భాను ప్రకాశ్ చులకనగా మాట్లాడారని

వివరాలు 2లో..

---

## తెలంగాణ సెంటిమెంట్ ఎగిరిపోయింది

- తెలుగు రాష్ట్రాల సీఎంలతో కేంద్ర ప్రభుత్వ సమావేశాన్ని స్వాగతిస్తున్నామన్న నారాయణ
- తెలంగాణకు రేవంత్ అన్యాయం చేయడం లేదని వ్యాఖ్య
- బనకచర్లపై తొలుత మాట్లాడింది తానేనన్న నారాయణ



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నీటి సమ స్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావే శాన్ని

వివరాలు 2లో..

---

### ఇది రూ. 3,200 కోట్ల స్కామ్ మాత్రమే కాదు...
## 30 వేల ప్రాణాలు బలిగొన్న స్కామ్

- ఏపీ లిక్కర్ స్కామ్ అంతర్జాతీయ స్థాయికి వెళ్లిందన్న సోమిరెడ్డి
- లిక్కర్ స్కామ్ పై ఈడీ విచారణ జరిపాలని డిమాండ్
- ఆర్థిక ఉగ్రవాదులపై మోదీ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని వ్యాఖ్య



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ అంత ర్జాతీయ స్థాయికి వెళ్లిందని టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఇది కేవలం రూ. 3,200 కోట్ల స్కామ్ కాదని... 30 వేల మంది ప్రాణాలు బలిగొన్న స్కామ్ అని చెప్పా రు. ఈ స్కామ్ ను దేశ సరిహద్దులు దాటించిన వైసీపీ నేతలకు స్వర్ణ పతకాలు ఇవ్వాలని అన్నారు.

వివరాలు 2లో..

---

## చంద్రబాబు చేస్తున్న ద్రోహం గురించి ప్రజలు ఆలోచించాలి

- ప్రజలను మభ్యపెడుతూ చంద్రబాబు లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారన్న శ్రీకాంత్ రెడ్డి
- వ్యవసాయం దండగ అన్నారని విమర్శ
- 16 ఏళ్లు సీఎంగా ఉండి ఏం సాధించారో చెప్పాలని డిమాండ్

**పెన్ పవర్ డెస్క్:**16 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రజలను మభ్యపెడుతూ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. చంద్రబాబు ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టును కూడా ప్రారంభించలేదని, పూర్తి చేయలేదని విమర్శించారు. వ్యవసాయం దండగ అన్న వ్యక్తి చంద్రబాబు అని ఎద్దేవా చేశారు.

వివరాలు 2లో..



---

## నా నియోజకవర్గంలో ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించబోతోంది

- ఉప్పాడను చాలాకాలంగా వేధిస్తున్న తీర ప్రాంత కోత సమస్య
- రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు
- ఎన్డీయే ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తోందన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**పెన్ పవర్ డెస్క్:**పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ ప్రాంతంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న సముద్ర తీర ప్రాంత కోత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ద్వారా ఉప్పాడలో తీర రక్షణ నిర్మాణాలను అభివృద్ధి చేసే ప్రతిపాదనను సుమారు రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తోందని తెలిపారు. "గత ఐదేళ్లలో సగటున ఏటా 1.23 మీటర్ల తీరం కోతకు గురైంది, దీంతో సుమారు 12 మీటర్ల తీరం కోల్పోయింది. ఇది సమీప గ్రామాలపై, ముఖ్యంగా మత్స్యకారుల గృహాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఎన్‌డీఏ ఎన్నికల వాగ్దానానికి కట్టుబడి,

వివరాలు 2లో..



---

## జగన్ విషం చిమ్ముతున్నారు



- తమిళనాడులో రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని పార్టీలు కలిసి పని చేస్తాయన్న పార్థసారథి
- ఏపీలో స్వార్థపూరిత ప్రతిపక్షం ఉందని విమర్శ
- జగన్ బాధ్యత గల నాయకుడిగా వ్యవహరించాలని హితవు

వివరాలు 2లో..

---

## చంద్రబాబు, రేవంత్ రెడ్డి చర్చించుకుంటే తప్పేముంది?



**పెన్ పవర్ డెస్క్:**చంద్రబాబు, రేవంత్ రెడ్డి రెండు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులని.... ఇద్దరూ కూర్చొని ఇరు రాష్ట్రాల సమస్యలపై చర్చించుకుంటే తప్పేముందని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ది ఫామ్ హౌస్ పాలన అని.... రేవంత్ రెడ్డిది ప్రజాపాలన అని చెప్పారు. తెలంగాణ హక్కుల కోసమే రేవంత్ రెడ్డి, మంత్రులు ఢిల్లీకి వెళుతున్నారని అన్నారు. చంద్రబాబు, రేవంత్ ఢిల్లీలో ఏం మాట్లాడుకున్నారో బీఆర్ఎస్ నేతలకు కనిపించలేదా? కళ్లు దొబ్బాయా? అని ప్రశ్నించారు. బావబామ్మర్దులది పనికిమాలిన ఏడుపు అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల పట్ల బీఆర్ఎస్ నేతలకు బాధ్యత లేదని విమర్శించారు. మీరు ఫాంహౌస్ లోనే ఉంటున్నారని...

వివరాలు 2లో..

- చంద్రబాబు, రేవంత్ రెండు రాష్ట్రాలు ముఖ్యమంత్రులన్న జగ్గారెడ్డి
- ఇద్దరూ ఢిల్లీలో ఏం మాట్లాడారో బీఆర్ఎస్ నేతలకు కనిపించలేదా అని ప్రశ్న
- మమ్మల్ని కూడా ఫామ్ హౌస్ లో పడుకోమంటారా అని ఎద్దేవా

---

### అనుకున్న సమయం కంటే ముందే
## భారత సైన్యానికి ఏకే-203 తుపాకులు

- భారత అమ్ములపొదిలో అత్యాధునిక తుపాకులు
- భారత్, రష్యా సంయుక్త భాగస్వామ్యంలో ఏకే-203 తుపాకుల తయారీ
- 2032 నాటికి 6 లక్షల రైఫిళ్ల తయారీ
- 22 నెలల ముందే టార్గెట్ పూర్తయ్యే అవకాశం

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# ప్లాన్ మార్చిన పవన్

జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకూ తనకు కేటాయించిన శాఖపై దృష్టి పెట్టిన పవన్ కల్యాణ్ ఇక పార్టీపై కూడా ఫోకస్ పెట్టాలని నిర్ణయించారు. పార్టీని బలోపేతం చేసే దిశగా పవన్ కల్యాణ్ అడుగులు ఇకపై ఉండనున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసి హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ సాధించారు. అయితే వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే జనసేన శ్రేణులను సిద్ధం చేసేందుకు జనసేనాని సిద్ధమవుతున్నట్లు సిద్ధమవుతుంది. ఇప్పటివరకూ గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖ లపై పూర్తి స్థాయి పట్టు సాధించిన పవన్ కల్యాణ్ ఇక పార్టీని కూడా బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

**షూటింగ్ లు కూడా పూర్తి కావడంతో...**

పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు నుంచి అగ్రిమెంట్లు చేసుకున్న సినిమాల షూటింగ్ లు కూడా దాదాపుగా పూర్తి కావచ్చాయి. వచ్చే నెలలో సినిమాల నుంచి కూడా పవన్ ఫ్రీ అవుతారు. దీంతో ఆయన ఇక పార్టీపై దృష్టి పెట్టి అత్యధిక నియోజకవర్గాల్లో ఒంటరిగా బలం పెంచుకుందామని డిసైడ్ అయ్యారు. కూటమిలో ఉంటూనే పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి 175 నియోజకవర్గాల నుంచి 225 నియోజకవర్గాలకు పెరుగుతుండటంతో జనసేన పొత్తులో భాగంగా పోటీ చేసే స్థానాల సంఖ్య కూడా పెరుగుతుంది. కనీసం ఈసారి అరవై స్థానాల్లో పోటీ చేయడానికి ఆయన సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది.

**సెప్టంబరు నెల నుంచి...**

ఇందుకోసం సెప్టంబరు నెల నుంచి పార్టీ పై ఫోకస్ పెట్టాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయ్యారు. ప్రస్తుతం గెలిచిన 21 నియోజకవర్గాలతో పాటు మరో అరవై నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా నిర్ణయాలు ఉంటాయని అంటున్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఇన్ ఛార్జులను నియమించకుండా సర్వే ద్వారా ఎంపిక చేసిన కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే ఇన్ ఛార్జులను నియమించి అక్కడ పార్టీని బలోపతేం చేసి, శ్రేణులతో తరచూ సమావేశాలు నిర్వహించాలని పార్టీ శక్తిని మరింత పెంచుకోవాలని చూస్తున్నారు. జనసేన పార్టీని విస్తృతం చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో జగన్ పార్టీని అధికారంలోకి రానివ్వకుండా చేసేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు జనసేనాని.

**అరవై నియోజకవర్గాల్లో...**

అరవై నియోజకవర్గాల్లో ఇప్పటికే పవన్ కల్యాణ్ సర్వే చేయించినట్లు తెలిసింది. అందులో యాభై నియోజకవర్గాల్లో జనసేన బలంగా ఉన్నట్లు తేలింది. ఆ యాభై నియోజకవర్గాల్లో కొంచెం కష్టపడితే ఖచ్చితంగా గెలవవచ్చన్న భావనతో పవన్ కల్యాణ్ ఉన్నారు. అక్కడ సామాజికవర్గంతో పాటు యువత, అభిమానుల సంఖ్య కూడా ఎక్కువగా ఉండటంతో పాటు టీడీపీ, బీజేపీ కలిస్తే తమ గెలుపు ఖాయమని నమ్ముతున్నా. అందుకే టీడీపీ తరహాలోనే వచ్చే సెప్టంబరు నెల నుంచి ఇంటింటికీ జనసేన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో యాభై నియోజకవర్గాలకు ముందుగానే ఇన్ ఛార్జులను నియమించాలని భావిస్తున్నారు. నమ్మకమైన, నీతినిజాయితీలున్న వారిని ఇన్ ఛార్జులుగా ఎంపిక చేయడంతో పాటు అక్కడ పర్యటించేందుకు కూడా పవన్ కల్యాణ్ ప్లాన్ చేసుకుంటున్నారని తెలిసింది.

# జగన్ విషం చిమ్ముతున్నారు

తమిళనాడులో రాజకీయ పార్టీలు రాజకీయంగా విభేదించినా... రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పనిచేస్తాయని ఏపీ మంత్రి పార్థసారథి అన్నారు. ఏపీలో మాత్రం స్వార్థపూరిత ప్రతిపక్షం ఉందని మండిపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం, నీటీపారుదల ప్రాజెక్టుల అంశంలో జరిగిన తప్పిదాలపై ప్రజల దృష్టి మరల్చేందుకు కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. అబద్ధాలే పునాదిగా పబ్బం గడుపుకునేందుకు జగన్ యత్నిస్తున్నారని పార్థసారథి విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వంలో పోలవరం 70 శాతం పూర్తయినప్పటికీ... జగన్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయిందని అన్నారు. జగన్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బాధ్యత గల రాజకీయ నాయకుడిగా జగన్ వ్యవహరించాలని హితవు పలికారు.

## రాష్ట్రానికి ఏం కావాలో పార్లమెంటు ద్వారా

# కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి

- మొదటి పేజి తరువాయి

తిరిగి ప్రక్రియలో పెట్టగలిగాం. ఇదే విధంగా జల్ జీవన్ మిషన్, ఆరోగ్య మిషన్ వంటి పథకాలపైనా దృష్టిపెట్టి అదనపు నిధుల సాధనకు కృషి చేయాలి. అలాగే ప్రతి అంశంపై ఎంపీలు పూర్తి అవగాహన కలిగి ఉండాలి, సమాచారాన్ని సిద్ధంగా ఉంచుకోవాలి. జరిగే రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు దృష్టిపెట్టాలి. నేను కచ్చితమైన సమాచారంతో ఉండబట్టే ఢిల్లీలో జరిగిన తెలుగురాష్ట్రాల సీఎంల సమావేశంలో రాష్ట్రానికి మేలు కలిగేలా వాదనలు వినిపించగలిగాను" అని చంద్రబాబు వివరించారు.

**ప్రజలతో మరింత మమేకమవ్వండి**

"రాష్ట్రం సంక్షోభంలో ఉన్న సమయంలో ప్రజలు మనకు ఓట్లు వేసి అధికారం ఇచ్చారు... పెద్ద సంఖ్యలో ఎంపీలను ఇచ్చారు. దీన్ని మనం రాష్ట్రాభివృద్ధి కోసం వినియోగించుకోవాలి. ఎంపీలు ప్రజలతో మమేకమై పనిచేయాలి. అనవసర విషయాల్లో ఎంపీలు ఎక్కడా జోక్యం చేసుకోవద్దు. వన్ టైం ఎంపీలుగా ఉండేలా ప్రవర్తించవద్దు. ప్రజలు పెట్టుకున్న ఆకాంక్షల మేరకు మీరు పని చేయాలి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన రాష్ట్రానికి ప్రధాని మోదీ మూడు సార్లు రాష్ట్రానికి వచ్చారు. యోగాంధ్ర వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొన్నారు. వీటిని మనం విజయవంతం చేశాం. జాతీయ స్థాయిలో రాష్ట్ర ఇమేజ్ పెరిగింది. దీన్ని మనకు అనుకూలంగా మలుచుకోవాలి. మామిడి రైతులకు కేంద్రం నుంచి అందాల్సిన సాయం వచ్చేలా చూడాలి. పల్ప్ పరిశ్రమలకు జీఎస్టీ తగ్గించే అంశంపైనా సంప్రదింపులు జరపాలి. ఇటీవల ఏపీలో జరిగిన పరిణామాలను వివరించాలి. రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లాలి. సమయానుకూలంగా వ్యవహరించి సభలో క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, జనాభా నిర్వహణ, పీ4 వంటి అంశాలను వివరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇదే సమయంలో నేరపూరిత రాజకీయ అంశాల ప్రస్తావన వచ్చినప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను వివరించాలి" అని అన్నారు.

**క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సివస్తోంది**

ఎంపీలతో సమావేశం సందర్భంగా సీఎం చంద్రబాబు ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలను ప్రస్తావించారు. క్రిమినల్స్ రాజకీయాల్లోకి వస్తే ఎలా ఉంటుందనేది జగన్ ప్రవర్తనతో అర్థమవుతోందని చెప్పారు. "జగన్ కారుకింద పడి తన భర్త చనిపోయాడని సింగయ్య భార్య ఫిర్యాదు చేస్తే... ఆ కేసులో నిందితుడిగా ఉన్న జగన్, సింగయ్య కుటుంబాన్ని పరామర్శ పేరుతో తన ఇంటికి పిలిపించుకుని 'లోకేశ్ నాకు కోటి రూపాయలు ఇస్తానని ఆశచూపారు... అందుకే కేసు పెట్టాను' అని బెదిరించి మరీ ఆమెతో చెప్పించారు. వివేకా హత్య సమయంలోనూ ఇదే తరహా డ్రామా ఆడారు. వివేకా చనిపోయారని నేను బాధపడితే నాపైనే ఆరోపణలు చేశారు. నారాసుర రక్త చరిత్ర అంటూ కథనాలు రాశారు. సీఎంగా ఉన్న నాపైనే హత్యారోపణలు చేసే ధైర్యం చేశారంటే ఎంత బరితెగించినవాళ్లో అర్థం చేసుకోవాలి. మన దురదృష్టం కొద్దీ అలాంటి వాళ్లతో రాజకీయం చేయాల్సి వస్తోంది. ఇలాంటి విషయాలను దృష్టిలో పెట్టుకుని ఎంపీలుగా మీరూ అప్రమత్తంగా ఉండి ప్రజలను చైతన్యం చేయాలి" అని ఎంపీల సమావేశంలో అన్నారు. ఢిల్లీలో తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశ అంశాలను కూడా ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

## చంద్రబాబు, రేవంత్ రెడ్డి చర్చించుకుంటే తప్పేముంది?

- మొదటి పేజి తరువాయి

మమ్మల్ని కూడా ఫాంహౌస్ లోనే పడుకోమంటారా? అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలన సరిగా లేకనే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారం ఇచ్చారని జగ్గారెడ్డి అన్నారు. పదేళ్లు రాజభోగం అనుభవించి పదవి పోయేసరికి షాక్ లో ఉన్నారని అన్నారు. కేటీఆర్ కు పదవి లేదనే బాధ ఓవైపు, చెల్లెలి స్ట్రోక్ మరోవైపు ఉందని చెప్పారు.

## నా నియోజకవర్గంలో ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించబోతోంది

- మొదటి పేజి తరువాయి

అవసరమైన అనుమతులు లభించిన వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని పవన్ కల్యాణ్ తెలిపారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్‌డీఎంఏ ద్వారా కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలను సమర్పించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తారని, హోం మంత్రి అమిత్ షా కాకినాడ ప్రజల ఆకాంక్షలను గుర్తిస్తారని ఆశిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉదారంగా సహకరిస్తున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్టు ఆమోదం పొంది, బాధితులకు వారు ఎప్పటి నుంచో కోరుకున్న ఊరట లభిస్తుందని పవన్ కల్యాణ్ తన ట్వీట్ లో ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇది రూ. 3,200 కోట్ల స్కామ్ మాత్రమే కాదు... 30 వేల ప్రాణాలు బలిగొన్న స్కామ్

- మొదటి పేజి తరువాయి

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు, కాళేశ్వరం ప్రాజెక్టులపై ఈడీ విచారణ జరుగుతోందని... ఏపీలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్ పై కూడా ఈడీ విచారణ జరపాలని సోమిరెడ్డి డిమాండ్ చేశారు. రూ. 50 కోట్లు పెట్టి కుక్క పిల్లను కొన్నానని ఒక వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టు పెడితే... అది ఫేక్ అని కూడా తెలుసుకోకుండానే ఈడీ స్పందించిందని... ఏపీ లిక్కర్ స్కామ్ పై కూడా ఈడీ అదే విధంగా స్పందించాలని కోరారు. పహల్గామ్ టెర్రరిస్టులపై ప్రధాని మోదీ తీసుకున్న చర్యలు చూశామని... అదే విధంగా ఆర్థిక ఉగ్రవాదులపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని చెప్పారు.

## చంద్రబాబు చేస్తున్న ద్రోహం గురించి ప్రజలు ఆలోచించాలి

- మొదటి పేజి తరువాయి

వ్యవసాయ రంగానికి దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఐదేళ్లలో హంద్రీనీవా పూర్తి చేయాలని వైఎస్సార్ భావించారని చెప్పారు.

ప్రాజెక్టులను నాశనం చేసిన చంద్రబాబు... మళ్లీ జగన్ ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. కర్నూలు నుంచి హైకోర్టును, లా యూనివర్సిటీని తరలించారని విమర్శించారు. చంద్రబాబు చేస్తున్న ద్రోహం గురించి ప్రజలు ఆలోచించాలని చెప్పారు. 16 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఏం సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## నాపై నీచమైన వ్యాఖ్యలు చేసిన భానుపై చర్యలు తీసుకోండి

- మొదటి పేజి తరువాయి

ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. తనను వ్యాంప్ కు ఎక్కువ... హీరోయిన్ కు తక్కువని నీచమైన వ్యాఖ్యలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మహిళ గురించి ఎవరైనా ఇంత నీచంగా మాట్లాడతారా? అని ప్రశ్నించారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా మాట్లాడిన భాను ప్రకాశ్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న అకృత్యాలపై గొంతెత్తినందుకు గాలి భాను తనను దుర్భాషలాడుతూ బాధ పెట్టారని రోజా అన్నారు. ఇది కేవలం తనకు మాత్రమే జరిగిన అవమానం కాదని... అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించేందుకు ధైర్యం చేసిన ప్రతి మహిళపై జరిగిన దాడి అని చెప్పారు. ఇది ఒక ప్రమాదకరమైన సంస్కృతి అని అన్నారు.

# తెలంగాణ సెంటిమెంట్ ఎగిరిపోయింది

- మొదటి పేజి తరువాయి

ఏర్పాటు చేయడాన్ని సీపీఐ స్వాగతి స్తుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. నదుల్లో రెండు రాష్ట్రాల వాటాలు తేలిన తర్వాతే ప్రాజెక్టులపై ముందుకు వెళ్లాలని చెప్పారు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీగా మారిన తర్వాత తెలంగాణ సెంటిమెంట్ ఎగిరిపోయిందని... ఇప్పుడు తెలంగాణలో ఎలాంటి సెంటిమెంట్లు లేవని అన్నారు.

రేవంత్ రెడ్డి ప్రజలచేత ఎన్నుకోబడిన నేత అని... నామినేట్ చేయబడిన వ్యక్తి కాదని నారాయణ చెప్పారు. పొట్టివాడు గట్టివాడు అని కితాబునిచ్చారు. తెలంగాణకు రేవంత్ ఎలాంటి అన్యాయం చేయలేదని అన్నారు. రేవంత్ ను విమర్శిస్తూ రాజకీయాలు చేయాలనుకోవడం సరికాదని చెప్పారు. నీళ్లను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం... తల్లిని అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం వంటిదేనని అన్నారు. బనకచర్లపై తొలుత మాట్లాడింది తానేనని నారాయణ చెప్పారు. ఈ ప్రాజెక్టు గురించి చంద్రబాబు కొంచెం అతిగా మాట్లాడారని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండానే బనకచర్లను తెరపైకి తెచ్చారని అన్నారు. తొలుత పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని సూచించారు. బనకచర్ల ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టు కాదని అన్నారు. ఇది రూ. 80 వేల కోట్ల ప్రాజెక్టు కాదని... రూ. 2 లక్షల కోట్లు అవుతుందని చెప్పారు. రెండు రాష్ట్రాలు వివాద రహితంగా ప్రాజెక్టులు కట్టుకోవాలని హితవు పలికారు.

# టీడీపీకి అశోక్ గజపతిరాజు రాజీనామా

- మొదటి పేజి తరువాయి

ఇటీవలే కేంద్రప్రభుత్వం ఆయన ను గోవా గవర్నర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన టీడీపీ ప్రాథమిక సభ్యత్వం, పొలిట్ బ్యూరోకు, జీవితకాల సభ్యత్వంకు రాజీనామా చేశారు. దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ హయాం నుంచి ఇప్పటి వరకు టీడీపీలో పనిచేసేందుకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీలో ఎన్నో అవకాశాలు అందుకున్నట్లు చెప్పుకొచ్చారు. ఇన్ని అవకాశాలు కల్పించిన పార్టీకి, సీఎం చంద్రబాబుకు అశోక్ గజపతిరాజు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇటీవలే ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు తనకు గోవా గవర్నర్‌గా అవకాశం కల్పించిన నేపథ్యంలో పార్టీకి పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే గోవా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే తన రాజీనామాను ఆమోదించవలసిందిగా ఆయన టీడీపీ అధిష్ఠానాన్ని కోరారు. ఈ మేరకు రాజీనామా లేఖను టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులకు పంపించారు.

**ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా విజయం**

అశోక్ గజపతి రాజు టీడీపీలో సీనియర్ నేత. విజయనగరం అసెంబ్లీ నియోజవర్గం నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా, విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీగా ఒకసారి గెలుపొందారు. అశోక్ గజపతి రాజు తన తండ్రి పీవీజీ రాజు బాటలోనే రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. అశోక్ గజపతి రాజు తొలిసారిగా 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా ఏపీ శాసనసభకు ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించినప్పటి నుంచి అశోక్ గజపతి రాజు పార్టీలో కొనసాగుతున్నారు.

1983లో టీడీపీ నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు రెండవసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో కూడా విజయనగరం నుంచి విజయం సాధించారు. అయితే, 2004లో అశోక్ గజపతిరాజు ఓటమి పాలయ్యారు. కానీ, 2009లో తిరిగి అక్కడి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఉమ్మడి ఏపీలో మంత్రిగా కూడా పనిచేశారు.

**కేంద్రమంత్రిగా పనిచేసిన అశోక్ గజపతిరాజు**

2014లో విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన అశోక్ గజపతి రాజు ఎన్డీయే ప్రభుత్వంలో కేంద్ర పౌర విమానయాణ శాఖ మంత్రిగా చేశారు. 2018లో ఎన్డీయే నుంచి టీడీపీ బయటకు వచ్చేవరకు ఆయన కేంద్ర మంత్రిగా కొనసాగారు. 2019 ఎన్నికల్లో విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మరోసారి బరిలో నిలిచిన ఆయన స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. అదే సమయంలో విజయనగరం అసెంబ్లీ స్థానం నుంచి అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు బరిలోకి దిగి ఓడిపోయారు. అయితే, 2024 ఎన్నికల్లో విజయనగరం నుంచి బరిలో దిగిన అదితి గజపతిరాజు విజయం సాధించారు.

# అనుకున్న సమయం కంటే ముందే భారత సైన్యానికి ఏకే-203 తుపాకులు

భారత సైన్యం అమ్ములపొదిలోకి అత్యాధునిక ఏకే-203 అస్సాల్ట్ రైఫిల్స్ చేరనున్నాయి. ఇవి సైనికుల పోరాట సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నాయి. భారత్, రష్యా సంయుక్తంగా ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలోని కోర్వా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఆర్‌ఆర్ పీఎల్) ద్వారా ఈ రైఫిల్స్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. నిర్మాణం మరియు వ్యయం: భారతదేశం, రష్యా మధ్య సుమారు ?5,200 కోట్ల ఒప్పందంలో భాగంగా 6 లక్షలకు పైగా ఏకే-203 రైఫిల్స్‌ను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 1,18,000 రైఫిల్స్ భారత సైన్యానికి అందాయి. డిసెంబర్ 2025 నాటికి ఈ రైఫిల్స్ ఉత్పత్తిలో 100 శాతం స్వదేశీకరణ సాధించాలని భారత్ యోచిస్తోంది. వాస్తవానికి ఒప్పందం ప్రకారం 2032 నాటికి 6 లక్షల రైఫిళ్లను సైన్యానికి అందించాల్సి ఉంది. అయితే, అనుకున్న సమయానికి 22 నెలల ముందే రైఫిళ్లను సైన్యానికి అందించేందుకు ఐఆర్‌ఆర్ పీఎల్ కృషి చేస్తోంది. సామర్థ్యం మరియు లక్షణాలు: ఈ రైఫిల్స్ నిమిషానికి 700 రౌండ్ల వేగంతో కాల్పులు జరపగలవు. ఇవి 7.62 %ఇ% 39ఎంఎం క్యాలిబర్ కలిగి ఉంటాయి. వీటి బరువు కేవలం 3.8 కిలోగ్రాములు, ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఇన్సాస్ రైఫిల్స్ (4.15 కిలోగ్రాములు) కంటే తేలికైనవి. ప్రభావవంతమైన ఫైరింగ్ రేంజ్ 800 మీటర్ల వరకు ఉంటుంది. వీటిని 'షేర్' అని కూడా పిలుస్తారు.

ప్రాముఖ్యత: ఈ అత్యాధునిక రైఫిల్స్ భారత సైన్యం యొక్క ఫైర్‌పవర్‌ను పెంచి, సరిహద్దు భద్రతను బలోపేతం చేస్తాయి. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా దేశీయంగా ఈ రైఫిల్స్ ఉత్పత్తి కావడం భారతదేశ రక్షణ రంగంలో స్వయం సమృద్ధిని సూచిస్తుంది. ఈ రైఫిల్స్ భారత సైన్యానికి లభ్యం కావడంతో దేశ రక్షణ సామర్థ్యం మరింత పటిష్టమవుతుందని రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలి



**కర్నూలు, పెన్ పవర్ జూలై 18 :** అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని క్యాంప్ కార్యాలయంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రీచ్ ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇసుక రవాణాను పటిష్టంగా పర్యవేక్షణ చేయాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు... హంద్రీ, తుంగభద్ర ఇసుక రీచ్ ల వద్ద అక్రమ ఇసుక రవాణా కు సంబంధించి పత్రికలలో ప్రతికూల వార్తలు వస్తున్నాయని, రెవెన్యూ, పోలీస్ అధికారులు తనిఖీ చేస్తున్నారా, లేదా అని కలెక్టర్ రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆరా తీశారు. అక్రమ ఇసుక రవాణా పై వస్తున్న వార్తలపై వెంటనే స్పందించి పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు వెళ్లి తనిఖీ చేసి కేసులు పెట్టి వాహనాలను సీజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నప్పటికీ విఆర్ఓ లు సమాచారం ఇవ్వకుండా ఉన్నట్లయితే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.. ఇప్పటి వరకు అక్రమ ఇసుక రవాణా కు సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదికలు పంపాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు టౌన్ డి.ఎస్.పి బాబు ప్రసాద్, ఆర్టీవో భరత్, మైనింగ్ అధికారి రవి చంద్, భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈ ఈ కిషోర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు..





## 19న తిరుపతి జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన

### - కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్.ఎస్

**రేణిగుంట, పెన్ పవర్ జూలై 18 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూలై 19న తిరుపతిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో తిరుపతిలో పర్యటించనున్నారని పర్యటన ఏర్పాట్లను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్.ఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా తూకివాకు వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్, అలిపిరి, పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ప్రదేశాలలో పర్యటన భద్రత ఏర్పాట్లపై ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మున్సిపల్ కమిషనర్ మౌర్యతో కలిసి పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఈ నెల జూలై 19న ఉదయం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి తిరుపతిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొననున్నారని, భద్రత ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని కట్టుదిట్టంగా ఉండాలని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## వకుళమాత ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

### - టిటిడి చైర్మన్ బీ.ఆర్.నాయుడు





**తిరుపతి పెన్ పవర్ జూలై 18 :** పాతకాల్వ పేరూరు బండపై వెలసిన వకుళమాత ఆలయానికి భక్తుల రాక పెరుగుతోందని, ఈ ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. పేరూరు వకుళామాత ఆలయాన్ని టీటీడీ చైర్మన్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అందుతున్న సౌకర్యాలు, క్యూ లైన్లు పరిశీలించారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన పనులపై నివేదిక తయారు చేయాలని టిటిడి అధికారులకు సూచించారు. తక్షణం చేపట్టాల్సిన పనుల వివరాలను తమ దృష్టికి తీసుకువస్తే టిటిడి బోర్డులో చర్చించి ఆమోదం తెల్పుతామన్నారు. అంతకుముందు ఆలయ అధికారులు, అర్చకులు చైర్మన్ కు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేపట్టి అమ్మవారి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జి.భాను ప్రకాష్ రెడ్డి, ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

### రోడ్ల భూసేకరణకు సంబంధించి రైతులకు పరిహారం పంపిణీలో

## పెండింగ్ లేకుండా చూడాలి

### - ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతి లాల్ దండే



**కర్నూలు, పెన్ పవర్ జూలై 18 :** రోడ్ల భూసేకరణకు సంబంధించి రైతులకు పరిహారం పంపిణీలో పెండింగ్ లేకుండా చూడాలని రవాణా,రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతి లాల్ దండే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఆర్ అండ్ బి, నేషనల్ హైవే రోడ్లు,ప్రాజెక్ట్ లకు సంబంధించిన భూ సేకరణ, రవాణా, ఆర్టీసీ అంశాలపై ఆర్ అండ్ బి, నేషనల్ హై వే, రెవెన్యూ, రవాణా, ఆర్టీసీ శాఖల అధికారులతో రవాణా,రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతి లాల్ దండే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ NH 340, 340 జ, 150 C, 40 నేషనల్ హైవేస్ రోడ్లు, ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన సమస్యలు ఏమైనా ఉంటే తెలపాలని అధికారులను కోరారు. NH 150 C కి సంబంధించి బసాపురం, దిన్నె దేవరపాడు గ్రామాలకు సంబంధించి భూమి సమస్యలు పెండింగ్ ఉన్నాయని, నేషనల్ హైవేస్ కు సంబంధించిన అధికారులు ప్రిన్సిపల్ సెక్రెటరీ దృష్టికి తెచ్చారు.. వారంలోపు వీటిని పరిష్కరించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ కర్నూలు ఆర్డీవోను ఆదేశించారు..అలాగే కర్నూలు- దోర్నాల కు రోడ్ కు సంబంధించి పెండింగ్ లో ఉన్న క్లెయిమ్లను కూడా వారంలోపు పరిష్కరించాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆదేశించారు.



భూ సేకరణ పరిహారం పంపిణీలో జాప్యం చేయకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జ్యుడీషియల్ కోర్టుల్లో టాయిలెట్స్ నిర్మాణాలను ఆగస్టు లోపు పూర్తిచేయాలని ఆర్ అండ్ బి ఎస్ఈని ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా రోడ్ సేఫ్టీపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రహదారి నియమాలు పాటించేలా ఎన్ఫోర్స్మెంట్ చర్యలు తీసుకోవాలని పోలీస్, రవాణా శాఖల అధికారులను ఆదేశించారు..స్కూల్ బస్ ల ఫిట్ నెస్ పరిశీలించారా అని డిటిసి ని ఆరా తీశారు. బస్టాండ్లలో పారిశుద్ధ్యం పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు ఆదేశించారు టాయిలెట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అన్ని సౌకర్యాలతో ఒక మోడల్ బస్ స్టేషన్ ను కూడా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు..ఆగస్టు 15 వ తేదీ నుండి మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశ పెడుతున్న నేపథ్యంలో పూర్తి వివరాలతో జిల్లాకు సంబంధించిన నివేదికను ఇవ్వాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహిస్తున్న రోడ్ సేఫ్టీ సమావేశంలో జాతీయ రహదారులకు సంబంధించిన నిర్మాణాలు భూసేకరణ తదితర అంశాలపై సవివరంగా సమీక్షించడం జరుగుతోందని తెలిపారు.. జాతీయ రహదారుల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్ లలో నివారణ చర్యల్లో భాగంగా దాదాపు రూ.2 కోట్ల కు పైగా సైన్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్స్ వంటి పనులు చేయించామని వివరించారు.. రహదారి భద్రతా నియమాల పై కళాశాలల్లో, ఇతర ప్రాంతాల్లో అవగాహన కల్పించడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు.. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ లోడ్, ఎక్స్ట్రా ప్యాసింజర్ తదితర అంశాలకు సంబంధించి ఏప్రిల్ నుండి జూన్ 25 వరకు 717 కేసులు నమోదు చేయడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డిఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి, డిటిసి శాంతకుమారి, నేషనల్ హై వేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీతా బాయి, నేషనల్ హైవేస్, రోడ్లు భవనాలు, రవాణా, ఆర్టీసీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### కడప సెంట్రల్ జైలులో

## సెల్ ఫోన్ల కథ...

### - డీఐజీ విచారణ



**కడప పెన్ పవర్ జూలై 18 :** ఎర్రచందనం స్మగ్లర్ నుంచి 10 సెల్‌ఫోన్లు స్వాధీనం. కడప కేంద్ర కారాగారంలో ఖైదీల వద్ద సెల్‌ఫోన్లు పట్టుబడుతుండటంపై జైళ్ల శాఖ డీజీ విచారణకు ఆదేశం. కడప జైలులో విచారణ చేపట్టిన రాజమహేంద్రవరం జైలు డీఐజీ రవికిరణ్. ఖైదీలతో పాటు సిబ్బందిని ప్రశ్నిస్తున్న అధికారులు. కడప జైలులో పీడీ యాక్ట్ కింద అరెస్టై రిమాండ్ ఖైదీగా (ఎర్రచందనం స్మగ్లర్) ఉన్న వ్యక్తి నుంచి 10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వివరాలు అధికారులు తెలియజేయాల్సి ఉంది.

## పీజీ పరీక్షలను తనిఖీ చేసిన వైవియూ వీసీ



**కడప పెన్ పవర్ జూలై 18 :** యోగి వేమన విశ్వవిద్యాలయ పోస్ట్ గ్రాడ్యుయేషన్ రెండో సెమిస్టర్ పరీక్షలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు తనిఖీ చేశారు. వై వి యు పి జి కళాశాల కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. విద్యార్థుల హాల్ టికెట్లను చూశారు. వసతుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణలో తీసుకుంటున్న జాగ్రత్తలను చీఫ్ సూపరింటిడెంట్ ప్రొఫెసర్ కాత్యాయిని వివరించారు.

## తుమ్మలపెంటలో సుపరిపాలనలో తొలి అడుగు...



**నంద్యాల పెన్ పవర్ జూలై 18 :** కొలిమిగుండ్ల మండలం, తుమ్మలపెంట గ్రామంలో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రసంగం. అనుభవం కలిగిన నాయకుడు.. ఈ రాష్ట్రం, ప్రజలు అభివృద్ధి చెందాలని కోరుకునే నాయకుడు.. విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు. ప్రశాంతమైన జీవితంలో.. గ్రామాలు అభివృద్ధి సంక్షేమాలతో వికసించాలని కోరుకునే నాయకుడు చంద్రబాబు నాయుడు. అనుభవం కలిగిన చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న చేస్తున్నాం.. నేడు గ్రామానికి సంబంధించి పెండింగ్ సమస్యలను నా దృష్టికి తీసుకురావడం జరిగింది.. వచ్చే నాలుగేళ్ల పాలనలో.. డ్రైనేజీ కాలువలతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తాం. గ్రామ సచివాలయంలో సిబ్బంది కొరత వేధిస్తుందని గ్రామస్తులు నా దృష్టికి తీసుకొచ్చారు.. అలాగే కొంతమంది పెన్షన్ విషయంలో సమస్యలను నా దృష్టికి రావడం జరిగింది.. ఆయా సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం. నేడు గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని.. ఈ కార్యక్రమంలో అధికారులు కూడా తమ వెంట ఉంటే కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే వెసులుబాటు ఉంటుందన్న మంత్రి. సూపర్ సిక్స్ లో ఇచ్చిన అన్ని హామీలను నిలబెట్టుకున్న ప్రభుత్వం.. కూటమి ప్రభుత్వం. గతంలో వైసిపి హయాంలో గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేశారు. గతంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చాము.. అనుగుణంగా నేడు రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నాము. గతంలో రాష్ట్రం నుంచి పారిపోయిన పరిశ్రమలు నేడు పరిగెత్తుకొస్తున్న పరిస్థితి.. ఈ పరిశ్రమల రాకతో రాష్ట్రంలో 7 నుంచి 8 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నాము. నేడు కూటమి ప్రభుత్వం హయాంలో పోలవరం ప్రాజెక్టును పరిగెత్తిస్తున్నాం. రాష్ట్రానికి జీవనాడి-ఆశాదీపం పోలవరం ప్రాజెక్ట్. పోలవరంను పూర్తిచేస్తే రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించవచ్చు. గత ఐదేళ్లలో దేశంలో రాజధాని లేని నగరంగా అమరావతిని నిర్వీర్యం చేశారు. పక్క రాష్ట్రాల ప్రజలు.. మీ రాష్ట్ర రాజధాని ఏదని అవహేళన చేసే



పరిస్థితి తీసుకొచ్చారు. నేడు అమరావతిని దేశంలోనే గొప్ప అద్భుతమైన రాజధానిగా తీర్చిదిద్దుతున్నాం. దేశ విదేశాల్లో ఉండే వారి దృష్టిని కూడా అమరావతి ఆకర్షిస్తుంది. రాజధాని అమరావతిని పూర్తిచేస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇప్పటికే మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేసాం.. ఆగస్టులో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వనున్నాం. మళ్లీ పాదయాత్ర చేస్తామని నేడు వైఎస్ఆర్ నాయకులు చాలెంజ్ చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు పరదాల చాటున.. తాడేపల్లి ప్యాలెస్‌లో దాక్కున్న జగన్ మోహన్ రెడ్డి.. నేడు ఏ ముఖం పెట్టుకుని పాదయాత్ర చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన పర్యవేక్షించిన టిటిడి ఈవో జె.శ్యామలరావు



**తిరుపతి పెన్ పవర్ జూలై 18 :** తిరుపతి శ్రీ కపిలేశ్వర స్వామివారి ఆలయానికి శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో ఆలయంలో ఏర్పాట్లను టీటీడీ ఈవో జె.శ్యామలరావు శుక్రవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఈవో ఆలయ పరిసరాలు, పార్కింగ్, క్యూలైన్లు, పాదరక్షలు భద్రపరచు కౌంటర్లు, పుష్కరిణి, జలపాతం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్ఓ మురళీకృష్ణ, ఎస్ఈలు మనోహర్, వెంకటేశ్వర్లు, విజిఓ సురేంద్ర, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఆరోగ్యశాఖ డెప్యూటీ ఈవో సోమన్ నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఎల్లవేళలా అందుబాటులో ..

## - ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి





**రాజంపేట అన్నమయ్య పెన్ పవర్ జూలై 18 :** ఆకేపాటీ ఎస్టేట్ నందు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రాజంపేట నియోజకవర్గ ప్రజలకు సమస్యలపై వచ్చిన వారికి సానుకూలంగా స్పందించి వచ్చిన వారికి ఆయనే స్వయంగా అల్పాహారం అందజేయడం జరిగింది. వైఎస్ఆర్సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మరియు రాజంపేట శాసనసభ్యులు ఆకెపాటి అమర్ నాథ్ రెడ్డి.

# నటుడు ఫిష్ వెంకట్ అనారోగ్యంతో మృతి....!!



**కడప, పెన్ పవర్ జులై 18 :** కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధితో గత కొంతకాలంగా బాధపడుతున్న నటుడు ఫిష్ వెంకట్. 15 రోజులుగా హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ తీసుకుంటున్న ఫిష్ వెంకట్. కొద్దిసేపటి క్రితం హాస్పిటల్లో ఫిష్ వెంకట్ మృతి చెందాడు.

## డా. ఎన్టీఆర్ వైద్య సేవ కింద

# రోగులకు వైద్య సేవలు ఉచితం

### డిడిసి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ జూలై 18 :** డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు అన్ని వైద్య సేవలు ఉచితంగా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా కలెక్టరేట్లోని తమ ఛాంబర్ నందు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ స్కీం కింద వైద్యాధికారులతో డిడిసి(జిల్లా డిసిప్లైనరీ కమిటీ) సమావేశం నిర్వహించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వైద్య అభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేయడం జరుగుతుందని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు అన్ని వైద్య సేవలు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఐవిఆర్ ఎస్, మెడికల్ ఆడిట్ కేసులకు సంబంధించి రివ్యూ చేయడం జరిగింది. ఇందులో మొత్తం 12 కేసులకు సంబంధించి ఆసుపత్రుల ద్వారా అమౌంట్ రోగులకు ఇప్పించడం జరిగింది. ఇకనుంచి ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగుల నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయరాదని అన్ని వైద్య సేవలు ఉచితంగా ఇవ్వాలన్నారు. అలా చేయని యెడల పదింతల వరకు అపరాధ రుసు విధించడం తోపాటు ఆసుపత్రి లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఇందులో ముఖ్యంగా కన్సల్టేషన్ చార్జీలు, ఇన్వెస్టిగేషన్ కు, ఎమర్జెన్సీ సేవలు పూర్తి ఉచితంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఓ.లలిత, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ వై.రూపేంద్ర నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుని సన్మానించిన పాఠశాల సిబ్బంది



**సి.ఎస్.పురం, పెన్ పవర్ జులై 18 :** కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ నందు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేసి ఇటీవల బదిలీపై నల్లమడుగుల ఉన్నత పాఠశాలకు బదిలీ అయిన బి విష్ణు నారాయణ ను పాఠశాల హెచ్ఎం బి. ప్రసాద్ మరియు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషినిపలువురు కొనియాడారు. కష్టపడి పనిచేసే ఉపాధ్యాయుడికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని హెడ్ మాస్టర్ బి ప్రసాద్ అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ యం మస్తానయ్య, అధ్యాపకులు,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధర్మం కాపాడుతుంది.. అందుకే ధర్మం చేయండి...

## పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి





**కడప పెన్ పవర్ జూలై 18 :** బిచ్చగాడు అడుక్కునేటప్పుడు బాబూ 'దానం చెయ్యండి' అనేబదులు బాబూ 'ధర్మం చెయ్యండి'అని ఎందుకు అడుగుతాడు?

**ఆలోచించండి**

పూర్వకాలపు భారతీయ ధర్మం ఏమిటంటే.. సంపాదించిన దాన్ని నాలుగు భాగాలు చెయ్యాలి. మొదటి రెండు భాగాలు స్వంతానికి,మూడోభాగం పన్నులు, తదితరాలు!

**నాలుగో భాగం :**

కళాకారులు, గురువులు, పురోహితులు, సన్యాసులు ఇలాంటి వారికి ఇవ్వాలి. ఇది మన కనీస ధర్మం! దీనికి సంస్కారం అవసరం! వాళ్ళు అడుక్కోవాల్సిన అవసరంలేదు! 'దీన్ని ధర్మం పాటించడం' అంటారు! మన ధర్మం మనకి రక్ష! లేదంటే మన అహంకారానికి మనమే బలికాకతప్పదు!!

**దానగుణం:-**

ఒక బాటసారి సముద్రంతో ఇలా అన్నాడు. "నది ఎంత సన్నగా ఉన్నా దాని నీళ్ళు మాత్రం తియ్యగా

వుంటాయి. నీవు ఎంతో విశాలంగా ఉంటావు కానీ నీ నీళ్ళ మాత్రం చాలా ఉప్పగా వుంటాయి. దానికి కారణం ఏమిటి?" అని అడిగాడు. అప్పుడు సముద్రం ఇలా అంది. "నది ఈ చేత్తో తీసుకొని ఆ చేత్తో ఇతరులకు దానం చేస్తుంది. అందుకే ఆ నదిలోని నీరు తియ్యగా ఉంటుంది. నేను మాత్రం తీసుకుంటానే గాని, ఎవరికీ ఇవ్వను. కాబట్టి నా నీరు ఉప్పగా వుంటుంది" అంది. అందుకే "ఆ చేత్తో తీసుకొని,ఈ చేత్తో ఇవ్వని వారు జీవితంలోని మాధుర్యాన్ని కోల్పోతారు" అని మన పెద్దలంటారు

**సేకరణ. పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి**

**సర్వం శ్రీకృష్ణార్పణమస్తు**

**సర్వేజనా సుఖినోభవంతు**

**లోకా సమస్త సుఖినోభవంతు**

**శుభం భూయాత్**

**ఓం శాంతి శాంతి శాంతిః**

# బనకచర్ల నుంచి ఎస్సార్బీసీకి నీటిని విడుదల చేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి





**బనగానపల్లె పెన్ పవర్ జూలై 18 :** జలహారతి కార్యక్రమంలో భాగంగా బనకచర్ల కాంప్లెక్స్ నుంచి ఎస్సార్బీసీ కాలువకు కృష్ణా జలాల విడుదల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి, బీసీ జనార్దన్ రెడ్డి. సహచర ఎమ్మెల్యేలతో కలిసి కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి, పసుపు, కుంకుమ సమర్పించిన మంత్రిబీసీ జనార్ధన్ రెడ్డి. అనంతరం బనకచర్ల కాంప్లెక్స్ వద్ద రైతులు, శ్రీశైలం ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్యలతో కలిసి బటన్ నొక్కి ఎస్సార్బీసీ కాల్వకు నీరు విడుదల చేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. తదనంతరం ఎమ్మెల్యేలతో కలిసి, ఎస్సార్బీసీ కాలువలో కృష్ణమ్మ ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.

### మంచి మనసుతో చూస్తే

# అంతా మంచి వాళ్లే....

## - డాక్టర్ సునీత



**కన్హ పెన్ పవర్ జూలై 19 :** ఈరోజుల్లో తీయగా ఉంటే నమిలి మింగేస్తారు చేదుగా ఉంటే ఊసేస్తారు అందుకే ఉప్పు లాగా ఉండు ఎంతవరకు అవసరమో అంతవరకే వాడుకుంటారు. మనం మంచి మనసుతో చూస్తే అంతా మంచి వాళ్ళే. ప్రేమ అభిమానం గౌరవం మర్యాద మనం ఇతరులకు ఎంత ఇవ్వగలమో అంతే తీసుకోగలం. అలవాట్లు ఆయుధాలు లాంటివి. మంచివైతే జీవితాన్ని పైకి లేపుతాయి అవి చెడ్డవైతే పైకి లేచిన జీవితాన్ని కూడా క్రింద పడేస్తాయి. నువ్వు దిగాల్సిన చోటు వచ్చేదాకే నీ దగ్గర ఉన్న టికెట్ కు విలువ ఉంటుంది. నీ ప్రయాణం ముగిశాక అది ఒక చిత్తు కాగితమే. అందుకే విలువ కోల్పోయే లోపు నీ ప్రయాణానికి అర్థాన్ని వెతుక్కో. అతిగా మాట్లాడితే గౌరవాన్ని కోల్పోతాం అతిగా ఆశ పడితే సంతోషాన్ని కోల్పోతాం అతిగా ఆలోచిస్తే ప్రశాంతతను కోల్పోతాం అతిగా ఇష్టపడితే విలువలు కోల్పోతాం అందుకే ఏది అతి వద్దు మితం ముద్దు. మానవ సహజ లక్షణం ఏమంటే మానవులంతా పుణ్యఫలాలని కోరుకుంటారు కానీ పుణ్యం మాత్రం చేయరు. పాప ఫలం వద్దంటారు కానీ పాపాలనే చేస్తుంటారు.

డాక్టర్ సునీత కన్హ శాంతి వనం తెలంగాణ.
మానస సరోవరం

# పోస్ట్ ఆఫీసు సేవలు తాత్కాలికంగా నిలిపివేత





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జూలై 18 :** మార్కాపురం డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈరోజు జూలై 18 నుంచి 21వ తేదీ వరకు పోస్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్టు డివిజనల్ సూపరింటెండెంట్ జాఫర్ సాదిక్ తెలిపారు. జులై 22వ తేదీ నుండి యధావిధిగా సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. కొత్త సాఫ్ట్వేర్‌ను ఇన్‌స్టాల్ చేస్తున్న కారణంగా, అన్ని రకాల పోస్టల్ సేవలు నిలిపివేయనున్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మనో బందుకు శివారెడ్డి సేవలు చిరస్మరణీయం...

## - భూపతి రామకృష్ణంరాజు

**కడప పెన్ పవర్ జులై 18 :** కడప నగరంలోని సిహెచ్ఆర్డి డైరెక్టర్ అండ్ ఫౌండర్ శివారెడ్డితంత సేవలు చిరస్మరణీయమని మనోబంధు ఫౌండేషన్ చైర్మన్ భూపతి రామకృష్ణంరాజు కడపలో ఆయన స్వగృహంలో వారి కుటుంబ సభ్యులను ఓదారుస్తూ శివారెడ్డి గారి సేవలు చిరస్మరణీయమని ఆయన మనోబందుకు అందించిన సేవలు మరపు రానివని తెలియజేశారు. శివారెడ్డి గారి ఆకస్మిక మృతికి మనో బందు ఫౌండేషన్ కుటుంబ సభ్యులందరూ కలిసి ఆయన ఇంటికి వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శివారెడ్డి సేవలు రాయలసీమలోనే కాకుండా తెలంగాణ ఆంధ్రాలో కూడా ఆయన సంస్కరణ సభలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ మనో బందు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి తెలియజేశారు. ఆయన మతిస్థిమితం లేని అభాగ్యులను, చేరదీసి తర్వాత వారిని ఓల్డ్ ఏజ్ హోమ్లకు, వారి కుటుంబ సభ్యులకు మనోబంధు ఫౌండేషన్ తరపున దాదాపు నాలుగు సంవత్సరాలు నుండి సేవలు అందించారని ఫౌండర్ రామకృష్ణమ్మ రాజు తెలియజేశారు. గడిచిన నాలుగు సంవత్సరముల నుండి శివారెడ్డి మనోబంధు ఫౌండేషన్ తరపున సేవలను వినియోగించి దాదాపు 1200 మందికి మానసిక వైకల్యం నుండి మంచి ఆరోగ్య పరిస్థితి









తీసుకువచ్చారని మన బంధు కుటుంబ సభ్యులు తెలియజేశారు.











# సిఐటియు ఆధ్వర్యంలో డైలీవేజ్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె





**ధర్మవరం పెన్ పవర్ జులై 18 :** స్థానిక మున్సిపల్ ఆఫీసునందు శిబిరం ఏర్పాటు చేసి నుండి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులతో పాటు సమ్మెలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కార్మిక సంఘం శ్రీ సత్య సాయి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు మండల కన్వీనర్ జె వి రమణ, కో కన్వీనర్ టి,అయూబ్ ఖాన్, శ్రీ సత్య సాయి వాటర్ వర్క్స్ జిల్లా అధ్యక్షులు నరేష్ పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం బాబు , లక్ష్మీ ఓబులేసు, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు బొగ్గు నాగరాజు, జయ, మాట్లాడుతూ ధర్మవరం మున్సిపల్ పరిధిలో కరోనా సమయంలో తీసుకున్నటువంటి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రోజువారి వేతనం పెంచాలని మున్సిపల్ కమిషనర్ కి, మున్సిపల్ చైర్మన్ కి,గత ఐదు నెలలుగా వినతి పత్రాలు ఇస్తున్నా, ఇంతవరకు వేతనాలు పెంచకపోవడంతో కార్మికులు సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందన్నారు, గత 5 సం,రాలుగా నిత్యవసర సరుకుల ధరలు, కరెంటు చార్జీలు, గ్యాస్ రేట్లు, ఇంటి అద్దెలు, ఒకటికి నాలుగింతలు పెరిగినప్పటికీ కార్మికుల వేతనాలు పెంచక పోవడం చాలా దుర్మార్గామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కానీ, ప్రభుత్వ అధికారులు కానీ ఇప్పటివరకు వారికి కనీస వేతనం అమలు చేయకుండా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు. పట్టణ జనాభా ప్రతిపాదికన 400 మంది కార్మికులు ఉండవలసిన ధర్మవరం మున్సిపాలిటీలో కేవలం 253 మంది కార్మికులతోనే పని చేయించుకుంటూ వారిపైన పని భారం మోపుతున్నారన్నారు. అదేవిధంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు నేటితో 23 రోజులకు చేరుకుంది,కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు,అమలు చేయాలని, అదేవిధంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అనారోగ్య కారణాలవలన చనిపోయిన వారి కుటుంబాలకు ఉపాధి కల్పించలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల నేతలతో చర్చలుజరిపి, కార్మికులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ రెగ్యులర్ కార్మికులు, మున్సిపల్ రెగ్యులర్ పారిశుద్ద కార్మికులు అదేవిధంగా ఆప్కాస్ కార్మికులు మద్దతుతో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘంల నాయకులు అనిల్. వెంకట రాముడు, బి,ప్రసాద్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## గండికోట వైష్ణవి హత్యపై విచారణ చేపట్టాలి

### ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నివాళి






**జమ్మలమడుగు పెంపకం జూలై 18 :** గండికోటలో జరిగిన వైష్ణవి హత్యపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని RSF రాష్ట్ర అధ్యక్షులు డీ. యం ఓబులేసు యాదవ్, గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక సీమ కన్వీనర్ కారు ఆంజనేయులు, BSP జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప, రాయలసీమ ఎస్సీ ఎస్టీ ఉమెన్ రైట్స్ కన్వీనర్ జే. వి. రమణ,CPIML లిబరేషన్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల ఓబయ్య, MRP జాతీయ అధ్యక్షులు సంగటి మనోహర్, STF రాష్ట్ర అధ్యక్షులు యస్. రామాంజనేయులు, యస్. సుబ్బరాజు, హేతువాద సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి CRV ప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్ అంజి,అల్ ఇండియా బంజారా సంఘం జిల్లా అధ్యక్షులు జగన్ నాయక్, PSF రాష్ట్ర అధ్యక్షులు జి నాగరాజు, ఐసా జిల్లా కార్యదర్శి ప్రసన్న,లాయన్ NC యాదవ్, లోకసత్తా పార్టీ అధ్యక్షులు దేవర కృష్ణ, రసూల్,ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వేదిక రాష్ట్ర కన్వీనర్ నాగరాజు మాట్లాడుతూ కడప జిల్లా గండికోట పర్యాటక కేంద్రంలో గత ఐదు రోజుల క్రితం ఇంటర్ చదువుతున్న విద్యార్థిని వైష్ణవి మర్డర్ పై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు ఇప్పటివరకు ఈ ఘటన పైన పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టలని పోస్టుమార్టం రిపోర్టు బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు ఘటన జరిగే ఐదు రోజులు పూర్తయిన ఇప్పటివరకు వాస్తవాలను ప్రకటించకపోవడంలో రాజకీయ జోక్యం ఏమైనా ఉందా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు కడప జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత అనేక ఘటనల చోటుచేసుకున్నాయని మండిపడ్డారు హెూంమంత్రి ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి దోషులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు వైష్ణవి మర్డర్ పై పూర్తిస్థాయి విచారణ జరిపి దోషులను శిక్షించాలని కోరారు.

## ద్వితీయ వార్షిక రక్తదాన వారోత్సవాలు

### 315 మంది స్వచ్ఛందంగా రక్తదానం...





**కడప పెన్ పవర్ జూలై 18 :** కడప పట్టణంలోని కడప ఐటిఐ సర్కిల్ బాలాజీ నగర్ రోడ్ నెంబర్ 13 నెహ్రూ కేంద్ర యూత్ హాస్టల్ నందు కడప జిల్లా స్వచ్ఛంద సేవ సంస్థలు మరియు ఖాన్ కా రిష్టా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో,రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టెప్ సీఈవో సాయి గ్రేస్,పైడి కాల్వ విజయ్ కుమార్ ఖాన్ కా రిష్టా చైర్మన్ యం.తారీఖ అలీ పాల్గొన్నారు.. అతిథులు సాయి గ్రేస్ మాట్లాడుతూ కడప జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థలు ఐక్యమతంతో కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.. ప్రస్తుతం బ్లడ్ బ్యాంక్ నందు రక్త నిల్వలు చాలా తక్కువ ఆవశ్యకత ఉన్నాయని తెలిపారు.కావున 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్యకరంగా ఉన్నవారు స్వచ్ఛందంగా రక్తదానం చేయుటకు ముందుకు రావాలన్నారు.రక్తదానం చేయడం వల్ల పాత కణాలు పోయి కొత్త కణాలు రావడంతో ఎంతో ఆరోగ్యకరంగా ఉంటామని తెలియజేశారు. ఖాన్ కా రిష్టా చైర్మన్ యం.తారీఖ అలీ మాట్లాడుతూ కడప జిల్లాలోని స్వచ్ఛంద సేవకులు వారం రోజులు పాటు నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో ఇప్పటివరకు 315 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం చాలా సంతోషకరం అలాగే ఐకమత్యంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని కొనియాడారు అలాగే స్వచ్ఛంద సేవా ప్రతినిధులను సత్కరించారు.ఈ కార్యక్రమంలో జూటురు విజయ్ కుమార్, వి.శివశంకర్,పట్టుపోగుల సుబ్బారావు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 19న జిల్లా వ్యాప్తంగా స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను అమలి చేయాలి

### - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల పెన్ పవర్ జూలై 18 :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 19న మూడవ శనివారం జిల్లావ్యాప్తంగా స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి.. జిల్లాను ప్లాస్టిక్ రహితం, చెత్త రహితంగా రూపొందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19న మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లా డివిజన్ మండల గ్రామస్థాయిలలో పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఈనెల మూడవ శనివారం అంశం "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం" అనే ఇతివృత్తంతో స్వచ్ఛ కార్యక్రమా లను అమలు చేయడంలో ప్రజలలో అవగాహన పెంచాలి. ఆయా శాఖలు వారికి నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం సాధించేందుకు కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలో, మున్సిపాలిటీలు, పంచాయితీలలో ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన పెంచి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి అన్ని శాఖలు సమన్వయంగా కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.



## బనగానపల్లెలో "వన్ డే స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్"

### - ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు





**నంద్యాల పెన్ పవర్ జూలై 18 :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా రంగంలో వినూత్న ఆవిష్కరణలకు వీలు కల్పించే విధంగా రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆలోచనల మేరకు.. నేడు బనగానపల్లె నియోజకవర్గంలో రాష్ట్రంలోనే తొలిసారిగా "ఒకరోజు స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్" ను లాంఛనంగా ప్రారంభించడం జరిగిందని ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు తెలిపారు..నేడు బనగానపల్లె బాలికల పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో ఏపీ సైన్స్ సిటీ సీఈవో కె. వెంకటేశ్వర్లు, ముస్కాన్ కంపెనీ ప్రతినిధులు, సమగ్ర సర్వశిక్ష అభియాన్ అధికారులు, డిప్యూటీ డీఈవో డోన్, బనగానపల్లె మండలంలోని ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్గ నిర్దేశకత్వంలో.. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా.. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అంతరిక్షం విజ్ఞానంపై సమగ్ర అవగాహణ కల్పించేందుకు ONE DAY SPACE EDUCATION CAMP నిర్వహిస్తున్నట్లు ఆయన ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్పేస్ రాకెట్స్ కు సంబంధించి పరికరాలను విద్యార్థులకు ప్రదర్శించి చూపించడం జరిగింది.. అదే సమయంలో స్పేస్ సంబంధింత పరికరాలను కలపడం, విడదీయడం (డిస్ మ్యాండిల్) చేయడం కూడా ప్రాక్టికల్ గా విద్యార్థులకు చూపించడం జరిగింది. అదే సమయంలో నేడు సమకాలీన ప్రపంచంలో డ్రోన్స్‌ను విరివిగా వినియోగిస్తున్న క్రమంలో, వాటిపై అవగాహన కల్పించి, దేశ రక్షణలో వాటి ఉపయోగాలను ప్రాక్టికల్ గా విద్యార్థులకు చూపించారు. చంద్రయాన్ వంటి ప్రయోగాల్లో రోవర్ పనితీరును విద్యార్థులకు తెలిసే విధంగా మోడల్ రోవర్ ను విద్యార్థులకు ఇచ్చి, వారి చేత దాని పనితీరును విశ్లేషించడం జరిగింది. అదే విధంగా చంద్రయాన్ ఎలా ల్యాండ్ అయ్యిందనే విషయాన్ని విజువల్ గా విద్యార్థులు వర్చువల్ రియాలిటీలో (ఏ ఆర్, వీర్) ద్వారా వీక్షించే అవకాశం కల్పించడంతో దాని పనితీరును వివరించి, ప్రాక్టికల్ గా చూపించారు.

**స్పేస్ పై అవగాహన కార్యక్రమం నిర్వహణపై మంత్రికి అభినందనలు :**

ఈ వన్ డే స్పేష్ ఎడ్యుకేషన్ క్యాంప్ ను బనగానపల్లె నిర్వహించేందుకు ప్రోత్సహించిన గౌరవ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి స్థానిక విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.. ఇటువంటి ఎమ్మెల్యే, మంత్రి మా నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహించడం మా అందరికీ అదృష్టమంటూ వారు సంతోషం వ్యక్తం చేశారు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన కల్పించడంతో పాటు, టెక్నాలజీ రంగంలో సమగ్రాభివృద్ధిని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ శ్రీకారం చుట్టిందని ఏపీ సైన్స్ సిటీ సీఈవో కే. వెంకటేశ్వర్లు తెలిపారు... తొలి విడతలో నేటి నుంచి ఆగష్టు 6 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 10 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు...

## పేదరికాన్ని రూపుమాపేందుకే పి-4

### - జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా




**బండిఆత్మకూరు, పెన్ పవర్ జూలై 18 :** ప్రభుత్వం పేదరికాన్ని రూపుమాపేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా పి-4, కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా పేర్కొన్నారు. శుక్రవారం బండిఆత్మకూరు మండలంలో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా దత్తత తీసుకున్న నెమళ్ళకుంట తండాలో బంగారు కుటుంబాలకు రెడ్ క్రాస్, ఐటిడిఏ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి గృహెూపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4, కార్యక్రమాన్ని నంద్యాల జిల్లాలో ఈ కార్యక్రమం వందశాతం విజయవంతం చేసేందుకు మార్గదర్శకులు ముందుకు రావాలన్నారు. రాబోయే రోజులలో పేదరికపై యుద్ధం చేసి బంగారు కుటుంబాలను పూర్తిస్థాయిలో ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలోని ధనవంతులందరూ ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలు అనుకుంటే ఏదైనా సాధించగలరని చెంచుగూడెంలోని ప్రతి మహిళ తమ కుటుంబం చెడు వ్యసనాలకు దూరంగా ఉండేటట్లు చూసి కుటుంబ సంపాదనపై దృష్టి సారించాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ వారు చెంచుగూడెం గ్రామస్తులకు గృహపకరణాలు అందించడంతో వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నెమళ్లకుంట తండాలో దాదాపు 60 కుటుంబాలకు గృహెూపకరణాల వస్తువులు, దోమతెరలు, దుప్పట్లు, తార్పలీన్లు పంపిణీ చేయడం జరిగింది. చెంచుగూడెం గ్రామస్తులు ఏమి కావాలో తమకు తెలియజేసినట్లయితే వీలైనంత వరకు అవి ఇచ్చేందుకు ప్రయత్నిస్తానన్నారు. రెడ్ క్రాస్ వారి సహకారంతో వైద్య శిబిరాలు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి ఇంటింటికి తిరిగి చెంచుగూడెం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని వారి



సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శోభారాణి, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి, తహసిల్దార్, ఎంపీడీవో, శ్రీశైలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కే.వెంకట శివప్రసాద్, ఉప సర్పంచ్ లింగారెడ్డి, మెడికల్ ఆఫీసర్ లు, సిడిపిఓ, రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను

## పటిష్టంగా నిర్వహించాలి

### పర్యాటక ప్రదేశాలను ఆహ్లాదకరంగా : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ జూలై 18 :** జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయుటకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. తద్వారా ఈ రంగంలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని తన చాంబర్లో.. జిల్లాలో వివిధ పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటికి తీసుకున్న చర్యలు, ఇంకను చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా 24 పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. జిల్లాలో చాలెంజ్ బేస్ డేస్టినేషన్ కింద అహెూబిలంలో రూ.25 కోట్లతో జరుగు అభివృద్ధి కార్యక్రమాలు అటవీ శాఖతో సమన్వయం చేసుకొని తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందుకు డిఎఫ్ఓతో పర్యాటక అధికారులు, ఇంజనీర్స్ చర్చించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అప్రూవల్ కి పంపించాలని సూచించారు. బేలుం కేవ్స్ నందు బ్రిడ్జ్ త్వరగా పూర్తి చేయాలని, అక్కడ నీటి వసతికి ఇబ్బంది లేకుండా చూడాలని, అలాగే సిసి కెమెరాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. నంద్యాల్ నందు 2 ఎకరాలు, శ్రీశైలం నందు 50ఎకరాలు, సంగమేశ్వరం నందు 10ఎకరాలు, నొస్సం నందు 5ఎకరాలు, బోయలతడిపత్రి 2 ఎకరాలు, అవుకు బెలుం ల సంబంధిత భూమి ఆలినేషన్ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించి పర్యాటక ప్రదేశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ అనురాగ్ శర్మ, పర్యాటక ఇన్చార్జి అధికారి సత్యనారాయణ, డిపిఆర్ఓ పురుషోత్తం, డిజిపి ఎస్ఈ ప్రతాప్, టూరిజం అధికారులు, ఇంజనీర్లు, ఆర్కియలాజి, ఎండోమెంట్, కేసి కెనాల్, ఎడ్యుకేషన్, హెూటల్ అసోసియేషన్, స్పోర్ట్స్, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

## వైవీయూ కాన్వకేషన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌ను ఆహ్వానించిన వైవియు వీసీ




**కడప పెన్ పవర్ జూలై 18 :** యోగి వేమన విశ్వవిద్యాలయం 11, 12,13,14వ కాన్వకేషన్ నిర్వహణ కోసం అనుమతి ఇవ్వాలని, అలానే తమరు కులపతి హెూదాలో హాజరుకావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, వైవియు చాన్సిలర్ ఎస్.అబ్దుల్ నజీర్ ను విశ్వవిద్యాలయ ఇంచార్జీ వైస్ ఛాన్స లర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ను కలిసి విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని రాజభవన్‌లో వై.వి.యు. వీసీ రాష్ట్ర గవర్నర్ను కలిశారు. మొక్క ను అందజేసి దృశ్శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైయస్సార్ కడప జిల్లాలోని యోగివేమన విశ్వ విద్యాలయం గురించి గవర్నర్ కు వివరించారు. గవర్నర్ స్పందిస్తూ ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో కాన్వకేషన్ నిర్వహించుకోవాలని ఆయా తేదీల వివరాలు తమ కార్యాలయానికి తెలియజేయాలని ఉపకులపతికి ఆదేశాలు ఇచ్చారు. తప్పక హాజరవుతానని తెలిపారని వై వి యు వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు తెలిపారు. ఉపకులపతి వెంట విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు ఉన్నారు.

## గ్రామ పంచాయితీలను సందర్శించిన జడ్పి సిఈఓ చిరంజీవి



**పొన్నలూరు పెన్ పవర్ జూలై 18 :** పొన్నలూరు మండలంలో ఇంటి ఇంటి నుండి చెత్త సేకరణలో భాగంగా పొన్నలూరు గ్రామపంచాయతీని, సింగారబొట్లపాలెం గ్రామ పంచాయతీనీ జడ్పి సి ఈ ఓ చిరంజీవి శుక్రవారం నాడు సందర్శించడం జరిగింది. సింగారబొట్లపాలెం గ్రామంలో ప్రతిరోజు ఇంటింటి నుండి చెత్త సేకరణ జరుగుతుందా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఇంటి నుండే తడి చెత్త , పొడిచెత్తని విడివిడిగా సేకరించాలని హరిత రాయబారులకు వివరించడం జరిగింది. తదనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రముని సందర్శించి అక్కడ తయారవుతున్న వర్మి కంపోస్ట్‌ను నాడప్ పిట్స్ పరిశీలించి సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది.అనంతరం పొన్నలూరు గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త సేకరణ ను పరిశీలించి 5000 జానాభాకి చెత్త ఆటోతో పాటుగా చెత్త రిక్షాలు 4 కోనాలి అని ఆదేశించడం జరిగినది. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛదివస్ తడి చెత్త, పొడి చెత్త , ప్రమదాకర చెత్త గురించి వివరించి పాంప్లెట్ లు గ్రామ ప్రజలకు పంచడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత, పంచాయతీ కార్యదర్శి లు గీత, నారాయణ, గ్రామ ప్రజాప్రతినిధులు రమణా రెడ్డి మండవ ప్రసాద్ హరిత రాయబారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మనో బంధు ఫౌండేషన్ నాలుగవ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస






**విజయవాడ పెన్ పవర్ జూలై 18 :** విజయవాడ నగరం లో సిద్దార్ధ అకాడమీ ఆడిటోరియంలో మనోబంధు ఫౌండేషన్ నాలుగవ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, గెస్ట్ ఆఫ్ హానర్‌గా డాక్టర్ రాధికా రెడ్డి, పొట్లూరి భాస్కరరావు, డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రత్యేక ఆహ్వానితులుగా ఆంజనేయ రెడ్డి ట్రస్టీ, డి.చక్రపాణి ట్రస్ట్, ఇండ్ల రామసుబ్బారెడ్డి ట్రస్టీ విచ్చేయుచున్నట్లు, అలాగే రాయలసీమ జిల్లాలో నుండి స్వచ్ఛంద సేవ ప్రతినిధులు, డైరెక్టర్లు, చైర్మన్లు, హ్యూమన్ రైట్స్ సభ్యులు, తదితరులు పాల్గొంటున్నట్లు మేనేజింగ్ ట్రస్టీ రామకృష్ణంరాజు, కన్వీనర్ మనో బంధు ఫౌండేషన్, పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి తెలియజేశారు.

# బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుల కృషి అభినందనీయం... ఎంఈఓ జె ప్రసాద్ రావు

### ముఖ్యఅతిథిగా సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి







**సి ఎస్ పురం , పెన్ పవర్ జులై 18**

మండల పరిధిలోని ఉప్పలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు జే ఎస్ ఆనంద బాబు, డి.పున్నమ్మ, కమ్మనేతి వెంకటేశ్వర్లు, ఎల్.అంథోనీ, ఖాజా రహంతుల్లా, ఎమ్.రామయ్య గార్లకి పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ నాయబ్ రసూల్ అధ్యక్షతన ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈఓ జె.ప్రసాదరావు మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు పాఠశాలలో పనిచేసిన కాలంలో విద్యారంగంలో వారి చూపిన సేవలు అభినందనీయమని అన్నారు విద్యార్థులలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఎంతో కృషి చేశారని వారి సేవలు మరువలేనివని ప్రామాణిక విద్యాబోధనతో పాటు మానవీయ విలువలు బోధించడం వీరి విశేషత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సి యస్ పురం సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకట రెడ్డి మాట్లాడుతూ బదిలీ పై వెళుతున్న ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారని కొనియాడారు. పాఠశాల ఎస్ ఎం సి చైర్మన్ మౌలాలి రెడ్డి, గ్రామ పెద్దలు పులి రాజశేఖర్, ఆచారి మరియు పాఠశాల ఉపాధ్యాయులు వై.శ్రీనివాసులు,వహీద్, జ్యోష్ణ లు పాల్గొన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, సన్మాన పత్రాలు అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు హాజరై తమ అభిమాన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ –"ఈ గురువుల బోధన వల్లే మేము జీవితంలో మంచి మార్గంలో అడుగుపెట్టగలిగామని హర్షం వ్యక్తం చేశారు.సన్మాన కార్యక్రమం ముగింపులో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు భావోద్వేగంతో మాట్లాడుతూ – "ఈ పాఠశాలలో గడిపిన కాలం తమకు స్మరణీయమని మేము ఎప్పటికీ మర్చిపోలేమని విద్యార్థుల అభివృద్ధి కోసం చేసిన ప్రతి క్షణం మా జీవితానికి మకుటాయమానంగా నిలిచిందని అన్నారు.ఈ కార్యక్రమం ఓస్ఫూర్తిదా యకమైన వేడుకగా నిలిచింది. చివరగా అందరూ కలిసి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అరివేముల ప్రధానోపాధ్యాయులు ఒంగోలు వెంకటేశ్వర్లు, మండలంలోని ఉపాధ్యాయులు తోట శ్రీనివాసులు, డి సుబ్బరాయుడు, జి రామక్రిష్ణ, షేక్ హమ్మద్, సి హెచ్ చంద్ర శేఖర్, పి అరుణ, బత్తుల రవీంద్ర, యన్ గాంధీ, యన్ వి నారాయణ, జి శ్రీహరి, యం ప్రసాద్, సి హెచ్ సునీతా దేవి, ఎలిజబెత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం నాయకులు మార్తాల సుబ్బారెడ్డికి నివాళులు

### గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ జులై 18**

గిద్దలూరు మండలం, తాళ్ళపల్లె గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి తండ్రి మార్తాల సుబ్బారెడ్డి (78) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారుజామున స్వర్గస్థులయ్యారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ వారి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.. వారితో పాటు జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్, గిద్దలూరు, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్లు బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్ రెడ్డి, రాచర్ల మండల పార్టీ అధ్యక్షులు కటికే యోగానంద్, సొసైటీ బ్యాంకు చైర్మన్లు దుత్తా బాల ఈశ్వరయ్య, ముచ్చుకుంట్ల రామసుబ్బయ్య, గోపిరెడ్డి జీవనేశ్వర రెడ్డి, బిజ్జం రవీంద్రా రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, సర్పంచులు, మాజీ సర్పంచులు, మండలం నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

## ఉప్పలపాటికి ఘనంగా సత్కరించిన ఉమ్మడిశెట్టి శ్రీను



**పామూరు, పెన్ పవర్, జులై 18**

కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆశీస్సులతో శుక్రవారం పామూరు మండల సింగల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబును భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఉమ్మడిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో మండల సింగల్ విండో చైర్మన్ గా ఎన్నికైన టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ, మండల తెలుగు యువత అధ్యక్షులు, గ్రామపంచాయతీ 8వ వార్డు మెంబర్ ఉప్పలపాటి హరిబాబు ను భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఉమ్మడిశెట్టి శ్రీను మరియు మండల బిజెపి నాయకులతో కలిసి హరిబాబు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి, పులమవేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీను మాట్లాడుతూ హరిబాబు భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు కొప్పరపు సుబ్బారావు, కొత్తూరి హరిగోపాల్, పెరమన విజయ్ కుమార్ చారి, ద్రోనాదుల చరణ్, బొంతల హజరత్, పాడే అరవింద్, దేవిశెట్టి పవన్, చామల శ్రీనివాసరెడ్డి, సింగరాజు శివకృష్ణ తదితరులు ఉన్నారు.

## నరేంద్ర మోడీ నాయకత్వం దేశానికి ఎంతో అవసరం

### మండల బిజెపి నాయకులు స్పష్టం



**పొదిలి, పెన్ పవర్, జులై 18**

కేంద్రంలోని నరేంద్ర మోడీ నాయకత్వం భారతదేశానికి ఎంతో అవసరమని బిజెపి నాయకులు స్పష్టం చేశారు నరేంద్ర మోడీ 11 ఏళ్ల సుపరిపాలన సందర్భంగా స్థానిక 16వ వార్డులో బిజెపి నాయకులు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా బిజెపి నాయకులు ఆ వార్డులోని ఇంటింటికి వెళ్లి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, అందుకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఆకుపాటి లక్ష్మణ, సయ్యద్ ఖాదర్ భాష, ఎన్ నాగేశ్వరరావు తోపాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ నెల 21 నఉచిత నేత్ర వైద్య శిబిరం

### విశ్రాంత ఉద్యోగుల భవనం లో రవీంద్రనాథ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ జులై 18**

విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఈనెల 21న ఉచిత నేత్ర శిబిరమును శాంతిరామ్ మల్టిస్పెషలిటి వైద్యశాల సౌజన్యం ఏర్పాటు చేస్తున్నట్లు ఆసంఘం అధ్యక్షులు గోటికె రవీంద్రనాధ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు ఉద్యోగులు మరియు పెన్షన్ దారులు వారి తల్లిదండ్రులు ఎక్కువ సంఖ్యలో సద్వినియోగం చేసుకోవలసిందిగా రవీంద్రనాథ్ రెడ్డి కోరారు వైద్యం కోసం వచ్చే పెన్షనర్స్ ఈ ఎచ్ ఎస్ కార్డు , ఆధార్ కార్డు లతో తప్పని సరిగా రావాలన్నారు.



## సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె ఆగదు...

### మున్సిపల్ కార్మికులు ఒంగోలు...



**కార్పొరేషన్ ఒంగోలు పెన్ పవర్ జూలై 18**

మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచేంతవరకు అలాగే పారిశుధ్య కార్మికుల సంక్షేమ పథకాల జీవో, సమ్మె కాలపు ఒప్పందల జీవో ఇచ్చేంత వరకు ఒంగోలు నగరంలో సమ్మె కొనసాగుతుందని కొర్నెపాటి శ్రీనివాసరావు అన్నారు. ఒంగోలు మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన సమ్మెలో భాగంగా శుక్రవారం నాడు మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మానవహారం నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షులు యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ప్రజలకు సేవ చేస్తూ తమ ఆయుష్ ని కాడ లెక్కచేయకుండా పనిచేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు. గత ఏడు సంవత్సరాల నుంచి. జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ లో పనిచేస్తున్న కార్మికులకు 21 వేల జీతము స్కిల్ కి 24 వేల జీతం ఇవ్వాలని గత సమ్మెలో ఒప్పందం చేసుకున్న సమ్మె కాలపు ఒప్పందాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పిల్లలకు ఉద్యోగాలు, కోవిడ్ కార్మికులు ఆప్కాసులో తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వం చర్చలకు పిలవాలని తెలిపారు. సమ్మెను పరిష్కారం చేయకుంటే నగరాలు కంపుకొడతాయని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జి నరసింహ, టీ విజయమ్మ, జాలయ్య, శంకరు, శివమ్మ, శ్రీదేవి, ఆర్ శ్రీనివాసరావు, కే వెంకటేశ్వర్లు, కే మోహన్ రావు,భారతి వంశి, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే సామ్రాజ్యం, బి బాబు, ఎం బాబు, జేమ్స్, అనిత, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

### పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు



**పొదిలి, పెన్‌పవర్, జూలై 18**

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ టి వెంకటేశ్వర్లు కోరారు శుక్రవారం నాడు మండలంలోని ఉప్పలపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి చెడు వ్యసనాలకు లోను కాకుండా, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన సూచించారు అలాగే విద్యార్థుల పట్ల వారి తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు, ఆశయాలు సఫలం చేసే విధంగా విద్యార్థులు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఆ దశలో ఎటువంటి తప్పులు చేసినా, బంగారు భవిష్యత్తును కోల్పోవాల్సి వస్తుందని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పొదిలి మండల పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ వివేమన, ప్రభుత్వ వైద్యాధికారి శరత్ చంద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కొమరోలు లోని ఇస్లాం పేటలో సాగుతున్న పందుల సంచారం

### రాత్రింబవళ్లు యదేచ్ఛగా సంచరిస్తున్న వరహాలు

### అసహ్యానికి, ఆందోళనకు గురవుతూ ఇబ్బందులు పడుతున్న ముస్లింలు

**కొమరోలు పెన్ పవర్ జూలై 18**



కొమరోలు లోని ఇస్లాంపేటలో పందుల సంచారం రాత్రింబవళ్లు యదేచ్ఛగా సాగుతున్నది. దీనితో ముస్లింలు అసహ్యానికి, ఆందోళనకు గురవుతున్నారు. గత కొన్ని రోజులుగా ఇస్లాంపేటలోని పలు వీధులలో పందుల సంచారం అధికంగా ఉంటున్నది. సినిమా హాలు పరిసర ప్రాంతాలలో పందుల పెంపకం సాగుతున్నట్లుగా పలువురు చెబుతున్నారు. వాటిని ఊరి బయటకు తరలించి పెంచుకోవలసిన పెంపకం దారులు పందులను యదేచ్ఛగా వదిలివేయడంతో అవి ఇస్లాంపేటలోని పలు వీధులు, సినిమా హాలు వెనుక వీధులు, గుట్ట కింది వీధులలో సంచరిస్తున్నాయి . దీనితో పందులు ఇళ్ల పరిసరాలలో, మురికి కాలువలు, చెత్తాచెదారం గల ప్రాంతాలలో సంచరిస్తున్నాయి. అప్పుడప్పుడు ఇండ్ల ప్రాంగణాలలో కూడా సంచరిస్తున్నందువల్ల ముస్లింలు తీవ్ర అసహ్యానికి, ఇబ్బందుల గురవుతున్నారు. అప్పుడప్పుడు చిన్నారులపై దాడులు కూడా చేస్తున్నాయని పలువురు చెబుతున్నారు. అంతేకాక మెదడు వాపు వ్యాధి తదితర ప్రాణాంతకమైన వ్యాధులు దోమల, పందుల సంచారంతో సంభవిస్తాయని భావిస్తున్న ముస్లింలు తమ చిన్నారులకు ఎలాంటి ప్రాణాంతకమైన వ్యాధులు సంభవిస్తాయోనని తీవ్రభయాందోళన వ్యక్తం చేస్తున్నారు, ఇటీవల కురుస్తున్న వర్షాలకు నేల చమ్మగా మారడంతో దోమల బెడద కూడా అధికంగా ఉంటున్నది. పందులను కుట్టిన దోమలు చిన్నారులకు కుట్టి, వారి ఆరోగ్యాలకు హాని కలిగిస్తాయని పలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున పట్టణంలో సాగుతున్న పందుల పెంపకాన్ని పట్టణం వెలుపలికి తరలించేందుకు చర్యలు తీసుకొని తమకు అసహ్యం నుంచి, భయాందోళన నుంచి కాపాడవలసిందిగా గ్రామపంచాయతీ అధికారులకు సిబ్బందికి ఇస్లాంపేట ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## శాసనసభ్యులు ఉగ్రను కలిసిన జాతీయ వాసవి సత్ర సముదాయాలు అధ్యక్షులు దేవకి



కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జులై 18

కనిగిరి శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని జాతీయ వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు, జనసేన నాయకులు దేవకి వెంకటేశ్వర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా కనిగిరి నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. జనసేన పార్టీలో వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు చేరికపై అత్యధిక ఆర్యవైశ్యులలో ఆనందోత్సవాలు నెలకొన్నాయి. అలాగే కనిగిరి నియోజకవర్గంలో జనసేన పార్టీకి పూర్తిస్థాయిలో బలపడనున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# డైనోసార్ అస్థిపంజరం రూ.223 కోట్లు.. 24 కేజీల రాయి రూ.37 కోట్లు



**హైదరాబాద్  పెన్ పవర్:** అవును.. భూమి మీద లభించిన అత్యంత విలువైన రాయిగా దీన్ని అభివర్ణిస్తున్నారు. ఎందుకంటే కేవలం 24.5 కేజీల రాయి విలువ.. తాజాగా నిర్వహించిన వేలంలో రూ.37 కోట్ల ధర పలికింది. పన్నులతో కలిపితే దీని విలువ రూ.45.61 కోట్లుగా తేల్చారు. ఎందుకింత ధర? ఈ రాయి అంత అరుదైనదా? దీని ప్రత్యేకత ఏమిటి? లాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతికితే.. ఈ రాయి మిగిలిన వాటికి ఎంత భిన్నమన్న విషయం అర్థమవుతుంది.అంగారక గ్రహం నుంచి పడిన రాయి కావటమే దీని విలువ అంతగా పెరగటానికి కారణమని చెప్పాలి. ఇప్పటివరకు 400 అంగారక శిలలే భూమి మీద దొరికాయి. పలు సందర్భాల్లో ఇలా పడే రాళ్లు సముద్రంలో పడతాయి. అందుకు భిన్నంగా ఈ రాయి సహారా ఎడారిలో పడటంతో దీన్ని గుర్తించగలిగారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమంటే.. ఇప్పటివరకు అంగారక గ్రహం నుంచి దూసుకొచ్చి పడిన ఈ రాయి మిగిలిన వాటి కంటే పెద్దది కావటం కూడా భారీ ధర పలికేందుకు కారణమైంది.38.1 సెంటీమీటరల పొడవు.. 24.5 కేజీల బరువున్న ఈ అరుదైన శిలకు ఎన్ డబ్ల్యూఏ 16788గా పేరు పెట్టారు. 2023 నవంబరులో ఆఫ్రికా ఖండంలోని నైగర్ దేశంలో దీన్ని పురాతత్వ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. తోకచుక్క / గ్రహశకలం భూవాతావరణం గుండా ప్రయాణించేటప్పుడు భూమి గురుత్వాకర్షణకు లోనవుతాయి. ఈ సందర్భంగా తోకచుక్క కొనలోని చిన్నపాటి శిలలు/ గ్రహశకలంలోని చిన్న రాతి ముక్కే ఈ అరుదైన శిలగా చెప్పాలి. ఇంత డబ్బులు పోసి వేలంలో సొంతం చేసుకున్న వారెవరన్న విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఈ తరహాలో అత్యంత అరుదైన చారిత్రక వస్తువుల్ని వేలం వేశారు. ఇదే వేలంలో భారీ ధరకు మరో వస్తువును అమ్మారు. అది సెరటాసారస్ డైనోసార్ అస్థిపంజరం. కోట్ల ఏళ్ల నాటి ఈ డైనోసారస్ అస్థిపంజరానికి రూ.223 కోట్లు పలకటం గమనార్హం. ఈ అరుదైన వస్తువులకు వేలాన్ని అమెరికాలో నిర్వహించారు.

# కవితకూ షర్మిలకూ ఫండ్స్ షార్టేజ్ !



**హైదరాబాద్  పెన్ పవర్:** రాజకీయం అంటే డబ్బుతోనే ఉంటుంది అడుగు తీసి అడుగు పెట్టాలీ అంటే డబ్బులు ఉండాలి. అపుడే కథ నడుస్తుంది. రాజకీయం ఏ మాత్రం అయినా పండుతుంది. మీడియాలో కనిపించాలన్నా జనం నోళ్ళలో నానాలన్నా తమ వెంట ఉండే ఆ నలుగురునీ తిప్పుకోవాలన్నా అంతా డబ్బుతో ముడిపడే ఉంటుంది. మరి అన్న చాటు చెల్లెళ్ళుగా ఉంటూ రాజకీయం అనే వట వృక్షంలో ఏ కొమ్మకో రెమ్మకో అల్లుకుని చల్లగా సాగిపోయే ఇద్దరు చెల్లెమ్మలకు ఇపుడు ఎండలో పడినట్లుగా పరిస్థితి మారింది.

ఇపుడు వారు తమను తాము రుజువు చేసుకోవాలని పట్టుదలతో ఉన్నారు. సరే ఇది బాగానే ఉంది, ఆ మాత్రం పట్టుదల ఉండాలి, ఎదగాలని కోరిక కూడా ఉండాలి. కానీ రాజకీయాల్లో కొనసాగాలన్నా ఏమి చేయాలన్నా కూడా డబ్బు అతి ముఖ్యం కదా. అందుకే నిధుల కొరత ఆ ఇద్దరు చెల్లెమ్మలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది అని అంటున్నారు.ఆ ఇద్దరూ ఘనమైన రాజకీయ వారసత్వం అందిపుచ్చుకున్న వారే. తండ్రులు దిగ్గజ నేతలు అన్నలు కూడా రాజకీయ వీరులే. కానీ ఆ ఇంట పూచిన చెల్లెమ్మలకు మాత్రం రాజకీయ వారసత్వం మీద మోజు ఉన్నా అది అంత సులువుగా దఖలు పడడం లేదు. అంది పుచ్చుకోవాలని చేస్తున్న ప్రయత్నాలు కూడా అంతగా కలసిరావడం లేదు. చిటారు కొమ్మన ఉన్న మిఠాయి పొట్లాం చేతికి అందేదెపుడు అన్నదే చెల్లెళ్ళ ఆలోచన.ఇక వైఎస్సార్ తనయగా జగన్న విడిచిన బాణంగా జనాలకు పరిచయం అయిన షర్మిల తీరు చూసినా కేసీఆర్ ముద్దుల కుమార్తెగా కేటీయార్ కి చెల్లెమ్మగా అయిన కవిత వైఖరి చూసినా రాజకీయం అనేది వారికి ఏ విధంగానూ సులభంగా కనిపించడంలేదు అని అంటున్నారు. రాజకీయం చేయాలంటే చాలా ఉండాలి మరి అంటున్నారు. ముఖ్యంగా ఫండ్స్ అవసరం అని చెబుతున్నారు.ముందుగా షర్మిల ముచ్చటనే తీసుకుంటే జగనన్న చేతిలో దెబ్బ తిన్న చెల్లెమ్మగా ఉన్న షర్మిలకు జగన్ తో కయ్యం వల్ల పెద్ద ఎత్తున వచ్చే ఆస్తిని పోగొట్టుకుంది అని అంటున్నారు. తన ఆస్తి తనకు కావాలని అన్నతోనే ఆమె యుద్ధం చేస్తున్న నేపథ్యం ఉంది. దాంతో షర్మిలకు ఇపుడు నిధుల కొరత చాలా ఎక్కువగానే ఉంది అని అంటున్నారు అన్నకు ఎదురు నిలిచిన ఫలితంగా ఆమెకు ఆస్తుల విషయంలోనూ న్యాయం దక్కలేదని అంటున్నారు.ఇక కవిత విషయం తీసుకుంటే ఆమెకు తండ్రి కేసీఆర్ ఉన్నారు కాబట్టి కొంతలో కొంత అడ్వాంటేజిగా ఉందని అంటున్నారు. అయితే ఆమె చేస్తున్న రాజకీయ చేష్టలు పోతున్న పోకడలతో కేసీఆర్ విసిగిపోయారని అంటున్నారు. దాంతో బీఆర్ఎస్ లో ఏ ఒక్కరి సపోర్టు కూడా కవితకు ఈ రోజున దక్కని వైనం కళ్ళ ముందే కనిపిస్తోంది అని అంటున్నారు.

ఇంత చేసినా కేసీఆర్ కి కూతురు మీద అమితమైన ప్రేమ ఉందని అంటున్నారు. అందువల్ల ఆస్తుల విషయంలో కానీ మరో విషయంలో కానీ కేసీఆర్ అయితే అన్యాయం కవితకు చేయరనే అంటున్నారు. అయితే తన తండ్రి ప్రేమను అడ్డం పెట్టుకుని కవిత మరింతగా దూకుడు చేస్తే మాత్రం అది బీఆర్ఎస్ కి మరింతగా తలనొప్పిగా మారుతుంది అని అంటున్నారు.ఇక అన్న కేటీఆర్ విషయం తీసుకున్నా ఆయన కూడా కవితకు పెద్దగా అన్యాయం చేసే పరిస్థితి లేకపోవచ్చు అని అంటున్నారు. దానికి కారణం కేసీఅర్ ఇంకా తన కుమార్తె వైపు ఉన్నారు, మద్దతుగా కూడా ఉన్నారని అంటున్నారు. అయితే కవిత ప్రతీసారీ ఏదో ఒక విమర్శ చేస్తూ బీఆర్ ఎస్ ని ఇబ్బంది పెడుతున్నారు అని అంటున్నారు. అది డైరెక్ట్ గా కానీ ఇండైరెక్ట్ గా కానీ బీఆర్ఎస్ కే తగులుతోంది అని అంటున్నారు. ఈ విధంగా కవిత ఎంత దూకుడు చేస్తే అంతగా ఆమెకూ బీఆర్ఎస్ కి నష్టమే అని అంటున్నారు.అలా కనుక ముందు ముందు పరిణామాలు మరింతగా మారితే మాత్రం అపుడు కవితకు బీఆర్ఎస్ పూర్తిగా దూరం అవుతుంది, కేసీఆర్ సపోర్టు కూడా దక్కకుండా పోతుంది అని అంటున్నారు. అపుడు కవితకు కూడా నిధుల సమస్య ఎదురు కావచ్చు అని అంటున్నారు ఏది ఏమైనా రాజకీయాల్లో అత్యున్నత శిఖరాలు అందుకోవాలని ఇద్దరు చెల్లెమ్మలూ ఆశిస్తూ ముందుకు రావడం వారి వరకూ సబబే అయినా ఎంచుకున్న దారుల వల్ల చేస్తున్న దూకుడు వైఖరి వల్ల అనుకున్నది సాధించడం మీదనే అందరికీ సందేహాలు వస్తున్నాయి. చూడాలి మరి తెలుగు నాట ఇద్దరు చెల్లెమ్మలూ రాజకీయంగా చెల్లని కాసులు అవుతారో లేక అన్ని విధాలుగా చలాయించే స్థాయికి చేరుకుంటారో.

# భర్తతో భార్య శృంగారానికి నిరాకరిస్తే... హైకోర్టు సంచలన వ్యాఖ్యలు!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల కాలంలో భార్యభర్తల మధ్య విడాకులకు సంబంధించి న్యాయస్థానాలు సంచలన వ్యాఖ్యలు చేస్తూ, కీలక తీర్పులు ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో విడాకుల అంశానికి సంబంధించి తాజాగా బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా... భర్తతో శృంగారానికి నిరాకరించడం క్రూరత్వంతో సమానమని స్పష్టం చేసింది!అవును... భర్తతో శృంగారానికి నిరాకరించడం, అతడికి వివాహేతర సంబంధాలున్నాయని అనుమానించడం క్రూరత్వంతో సమానమని తాజాగా బాంబే ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. విడాకులు పొందేందుకు వీటిని కారణాలుగా పేర్కొనవచ్చని తెలిపింది. కుటుంబ న్యాయస్థానం మంజూరు చేసిన విడాకులను సవాలు చేస్తూ ఓ మహిళ వేసిన పిటిషన్ ను తోసిపుచ్చింది.



వివరాల్లోకి వెళ్తే... 2013లో వివాహం చేసుకున్న ఓ జంట.. ఆ ఏడాది తర్వాతి నుంచి విడివిడిగా ఉంటోంది. ఈ సమయంలో... శృంగారానికి నిరాకరించడంతోపాటు వివాహేతర సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తూ తనను వేధిస్తోందని భర్త ఆరోపించాడు. ఇదే సమయంలో.. కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉద్యోగుల ముందు ఇబ్బంది పెడుతూ వేదనకు గురి చేస్తోందని అన్నాడు.

ఈ నేపథ్యంలో తనకు విడాకులు మంజూరు చేయాలని కోరుతూ 2015లో పుణెలోని ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ జరిపిన పూణె ఫ్యామిలీ కోర్టు.. విడాకులకు అనుమతించింది. దీంతో... ఈ తీర్పును సవాలు చేస్తూ ఆ మహిళ బాంబే హైకోర్టును ఆశ్రయించింది. ఈ సందర్భంగా... తనకు నెలకు రూ.లక్ష భరణం చెల్లించాలని విజ్ఞప్తి చేసింది.

ఇదే సమయంలో... అత్తమామలు మాత్రమే తనను వేధించారని.. భర్తపై తనకు ప్రేమ ఉందని, విడిపోవాలని తాను కోరుకోవడం లేదని పిటిషన్ లో పేర్కొంది. ఈ పిటిషన్ ను బాంబే ఉన్నత న్యాయస్థానంలో జస్టిస్ రేవతి మోహితే, జస్టిస్ నీలా గోఖలేల ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది.

ఇందులో భాగంగా... అతడి స్నేహితులు, తోటి ఉద్యోగులు ముందు ఆమె ప్రవర్తించిన తీరు దారుణంగా ఉందని భావించాల్సి వస్తుందని తెలిపింది. ఇదే సమయంలో.. దివ్యాంగురాలైన భర్త సోదరి, ఆయన కుటుంబీకుల పట్ల ఆమె ప్రవర్తన కూడా అతడి బాధకు కారణాలుగా అభిప్రాయపడింది. ఆ మహిళ పిటిషన్ ను తోసిపుచ్చింది.

# 'స్టార్ లింక్' ఛార్జీల మోత.. ఇండియాలో వాడుతారా?

**హైదరాబాద్  పెన్ పవర్:** ఇండియాలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు రూపురేఖలు మారబోతున్నాయి. ఎలాన్ మస్క్‌కి చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ అందిస్తున్న 'స్టార్ లింక్' సేవలు త్వరలో భారత్‌లో లభించనున్నాయి. ఇటీవలే భారత ప్రభుత్వానికి చెందిన ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్  నుంచి ఈ ప్రాజెక్టుకు అనుమతి లభించింది. ఈ ఏడాది చివర్లో లేదా 2026 ప్రారంభంలో ఈ సేవలు వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ సేవలు భారతదేశంలో ఇంటర్నెట్ లభ్యతను గణనీయంగా పెంచుతాయి అనడంలో సందేహం లేదు.




### స్టార్‌లింక్ అంటే ఏంటి?

స్టార్‌లింక్ అనేది స్పేస్‌ఎక్స్ అభివృద్ధి చేసిన శాటిలైట్ ఇంటర్నెట్ టెక్నాలజీ. పైన ఆకాశంలో తేలియాడుతున్న వందల శాటిలైట్ల ద్వారా భూమిపైని వినియోగదారులకు ఇంటర్నెట్ అందించడమే దీని లక్ష్యం. ఇది ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలు, , కనెక్టివిటీ లేని చోట్లకు అద్భుతమైన పరిష్కారం అవుతుంది. ప్రస్తుతం భూమిపై ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలు చేరుకోలేని ప్రదేశాలకు ఇది ఒక విప్లవాత్మక మార్పును తీసుకురాగలదు.

### ఎంత ఖర్చు అవుతుంది?

స్టార్‌లింక్ సేవలు భారత మార్కెట్లోకి వస్తున్నప్పటికీ, అందరికీ అందుబాటులో ఉంటాయా? అన్న ప్రశ్నకు సమాధానం కొంత క్లిష్టమే. ప్రారంభ ధరలు చాలా మందిని ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. స్టార్‌లింక్ కిట్ ధర: ?33,000 దీంతో శాటిలైట్ డిష్, రౌటర్, పవర్ సప్లై వస్తాయి. నెలసరి ప్లాన్: ?3,000 నుంచి ?4,200 వరకు ఉంటుంది. ఇన్‌స్టాలేషన్ ఖర్చు అదనంగా ఉండే అవకాశం ఉంది.

ఈ ధరలు చూసి చాలామంది నిరుత్సాహపడే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశీయ టెలికాం సంస్థలు అందిస్తున్న ఫైబర్ ఇంటర్నెట్ ప్లాన్లతో పోల్చితే, ఇది చాలా ఖరీదైనదే. ఉదాహరణకు, భారతీయ నగరాల్లో నెలకు ?500 - ?1000 లోపే అధిక వేగంతో కూడిన ఫైబర్ ఇంటర్నెట్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. స్టార్‌లింక్ ధరలు వాటికంటే ఐదు నుంచి ఆరు రెట్లు ఎక్కువ.

### ఎవరికీ ఉపయోగపడుతుంది?

ధరలు అధికంగా ఉన్నప్పటికీ, స్టార్‌లింక్ సేవలు ప్రధానంగా దూర ప్రాంతాల్లో, మారుమూల ప్రదేశాల్లో, కనెక్టివిటీ లేని ప్రాంతాల్లో అమూల్యంగా మారతాయి. ఇది ప్రధానంగా అటవీ, పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజలు, ఎక్కడైతే సాధారణ ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలు లేవో అక్కడ ఉపయోగపడుతుంది. ఆర్మీ క్యాంపులు, రిమోట్ రీసెర్చ్ సెంటర్లు, మైనింగ్ ప్రదేశాలు వంటి వ్యూహాత్మక ప్రదేశాలకు చేరువ అవుతుంది. అంబులెన్స్‌లు, మిలిటరీ వాహనాలు, విపత్తు నిర్వహణ బృందాలు వంటి అత్యవసర సేవలకు అందించగలదు. కేంద్రీకృతంగా ఉండని గ్రామీణ స్కూల్స్, హెల్త్ కేర్ సెంటర్లు, ఇక్కడ విద్య , వైద్య సేవలను డిజిటల్‌గా అందించడానికి...

సముద్రంలో ప్రయాణించే నౌకలు, లేదా ఎక్కడైతే స్థిరమైన ఇంటర్నెట్ అవసరమో అక్కడ స్టార్ లింక్ ఉపయోగపడుతుంది..

ఈ వర్గాలకు, అధిక ధర ఒక సమస్య కాకపోవచ్చు, ఎందుకంటే వారికి ఇంటర్నెట్ లభ్యత అనేది ఒక ప్రాథమిక అవసరం, ఇది వారి కార్యకలాపాలకు కీలకమైనది.

### స్పీడ్ - లాటెన్సీ ఎలా ఉంటాయి?

స్టార్‌లింక్ సాధారణంగా 50 Mbps నుంచి 250 Mbps వరకు స్పీడ్‌ను అందించగలదు. లాటెన్సీ పింగ్ సుమారు 20ms నుంచి 50ms మధ్య ఉంటుంది. ఇది వీడియో కాల్స్, ఆన్‌లైన్ గేమింగ్, అధిక డేటా అవసరమయ్యే అప్లికేషన్‌లకు సరిపోతుంది. మారుమూల ప్రాంతాల్లో ఈ స్పీడ్ చాలా అద్భుతంగా ఉంటుంది, ఎందుకంటే వారికి ప్రత్యామ్నాయంగా తక్కువ వేగంతో కూడిన, నమ్మశక్యం కాని ఇంటర్నెట్ మాత్రమే అందుబాటులో ఉండవచ్చు.

స్టార్‌లింక్ సేవలు భారతదేశంలో ఒక కొత్త ఇంటర్నెట్ యుగానికి నాంది పలకబోతున్నాయి. ధరలు అధికంగా ఉన్నప్పటికీ, కనెక్టివిటీ లేని ప్రాంతాలకు ఇది ఒక గొప్ప పరిష్కారం. పట్టణ ప్రాంతాల్లోని సామాన్య వినియోగదారులకు ఇది తక్షణ ఆకర్షణ కాకపోవచ్చు. అయితే, దీర్ఘకాలంలో, డిమాండ్ పెరిగి, ఉత్పత్తి వ్యయాలు తగ్గినట్లయితే, స్టార్‌లింక్ తన ధరలను తగ్గించే అవకాశం ఉంది. అప్పుడు, ఇది మరింత విస్తృతంగా ఉపయోగపడుతుంది.

# F-35 జెట్ తో తిరువనంతపురం విమానాశ్రయానికి ఊహించని ఆదాయం.. క్రేజ్

**హైదరాబాద్  పెన్ పవర్:** తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఇటీవల ఒక అరుదైన , ఆసక్తికరమైన సంఘటనకు వేదికైంది. బ్రిటన్‌కు చెందిన అత్యాధునిక %ఖీ-35దీ% ఫైటర్ జెట్, సాంకేతిక లోపం కారణంగా జూన్ 14న ఇక్కడ అత్యవసర ల్యాండింగ్ చేసింది. గత నెల రోజులుగా ఈ యుద్ధవిమానం తిరువనంతపురం విమానాశ్రయంలోనే నిలిపివేయబడి ఉంది. దీని ద్వారా విమానాశ్రయానికి గణనీయమైన పార్కింగ్ రుసుములు వస్తున్నాయి. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో భారత విమానాశ్రయాల సామర్థ్యాన్ని చాటిచెప్పే అవకాశంగా విశ్లేషకులు భావిస్తున్నారు.



### F-35B: ఒక సాంకేతిక అద్భుతం

దాదాపు $110 మిలియన్ల (రూ. 920 కోట్లు) ఖరీదు చేసే F-35B ప్రపంచంలోనే అత్యంత ఆధునిక యుద్ధ విమానాలలో ఒకటి. దీని ప్రత్యేకత షార్ట్ టేకాఫ్, వెర్టికల్ ల్యాడింగ్ సాంకేతికత కలిగి ఉంది.. ఇది తక్కువ ప్రదేశంలోనే టేకాఫ్ , ల్యాండింగ్ చేయగలదు, దీనిని చిన్న డెక్‌లు, అటవీ ప్రాంతాలు.. నౌకల వంటి ప్రదేశాలలో ఉపయోగించడానికి వీలు కల్పిస్తుంది. అలాంటి అత్యాధునిక జెట్ తిరువనంతపురం విమానాశ్రయంలో నిలిచిపోవడం ఆశ్చర్యం కలిగించింది.

### పార్కింగ్ రుసుముల లెక్క

నివేదికల ప్రకారం, ఇండియన్ డిఫెన్స్ రీసెర్చ్ వింగ్ (IDWR) ఆధారంగా ఈ జెట్‌కు ప్రతిరోజూ రూ. 26,261 చొప్పున పార్కింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంది. జూన్ 14 నుండి జూలై 17 వరకు 33 రోజులకు, మొత్తం రుసుము దాదాపు రూ. 8.6 లక్షలకు చేరినట్లు అంచనా. ఈ ఊహించని ఆదాయం తిరువనంతపురం విమానాశ్రయానికి ఆర్థికంగా కొంత ఊరటనిచ్చింది.

### మరమ్మత్తుల సవాళ్లు

సాధారణంగా సాంకేతిక సమస్యలున్న విమానాలు త్వరగా మరమ్మతు చేయబడి తిరిగి వెళ్తాయి. అయితే ఈ %ఖీ-35దీ% విషయంలో హైడ్రాలిక్ లోపం బయటపడటంతో సమస్య మరింత జఠిలమైంది. జూలై 6న బ్రిటన్ రాయల్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన 24 మంది బృందం, ఇందులో 14 మంది సాంకేతిక నిపుణులు, 10 మంది సిబ్బంది వచ్చి తిరువనంతపురం చేరుకుని విమాన పరిస్థితిని పరిశీలించింది. ఈ జెట్‌ను అక్కడే మరమ్మతు చేయాలో లేక విడదీసి బ్రిటన్‌కు పంపించాలో నిర్ణయించడానికి వారు ప్రయత్నిస్తున్నారు. రాయల్ నేవీకి చెందిన చిన్న బృందం లోపాన్ని సరిచేయడానికి ప్రయత్నించినప్పటికీ విఫలమయ్యారు.

### భవిష్యత్ ప్రణాళికలు

అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఈ వారం చివరికి జెట్ తిరిగి బ్రిటన్‌కు వెళ్లే అవకాశం ఉంది. అవసరమైతే దీన్ని విడదీసి C-17 గ్లోబ్‌మాస్టర్ వంటి పెద్ద విమానం ద్వారా తరలించే అవకాశం కూడా ఉంది. ఈ మొత్తం ప్రక్రియలో భారత వైమానిక దళం బ్రిటీష్ బృందానికి అవసరమైన సహాయాన్ని అందించింది. ఇది రెండు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని కూడా సూచిస్తుంది.

### అంతర్జాతీయంగా భారత విమానాశ్రయాల ప్రతిష్ట

ఈ సంఘటన తిరువనంతపురం విమానాశ్రయానికి కేవలం ఆదాయాన్ని మాత్రమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో దాని సామర్థ్యాన్ని కూడా చాటిచెప్పింది. అత్యాధునిక యుద్ధ విమానానికి అత్యవసర ల్యాండింగ్ సౌకర్యాన్ని కల్పించడం, దాని భద్రతకు భరోసా ఇవ్వడం , అవసరమైన సేవలను అందించడం ద్వారా భారత విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి ప్రమాణాలను కలిగి ఉన్నాయని రుజువైంది. ఇది భవిష్యత్తులో ఇలాంటి అంతర్జాతీయ సహకారాలకు మార్గం సుగమం చేయగలదు.

మొత్తం మీద యూకే F-35 జెట్ తిరువనంతపురం విమానాశ్రయంలో నిలిచిపోవడం ఒక అసాధారణ సంఘటన. ఇది విమానాశ్రయానికి కొంత ఆర్థిక లబ్ధిని చేకూర్చడమే కాకుండా, భారతదేశం యొక్క విమానయాన మౌలిక సదుపాయాలు.. దాని అంతర్జాతీయ భాగస్వామ్యాల సామర్థ్యాన్ని ప్రపంచానికి ప్రదర్శించింది.

బంగారు గుడ్లు పెట్టే బాతుగా ఐపీఎల్.. 2023-24లో

# బీసీసీఐకి రూ. 9,741 కోట్ల ఆదాయం!

- బీసీసీఐ ఆదాయంలో ఐపీఎల్‌దే అధిక వాటా
- బోర్డులో వందశాతం భాగమైన ఐపీఎల్
- నిరంతరం పెరుగుతున్న మీడియా హక్కుల విలువ
- దేశవాళీ ట్రోఫీలను కూడా వాణిజ్యీకరిస్తే మరింత ఆదాయం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 9,741.7 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇందులో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఒక్కటే రూ. 5,761 కోట్లతో సుమారు 59 శాతం వాటా కలిగి ఉండటం గమనార్హం. ఈ ఆదాయం ఐపీఎల్‌ను బీసీసీఐకి ప్రధాన ఆర్థిక వనరుగా నిలిపింది.ఐపీఎల్ ఒక వార్షిక ఫ్రాంచైజీ ఆధారిత టీ20 టోర్నమెంట్. 2007లో ప్రారంభమైన ఈ టోర్నమెంట్‌లో పది జట్లు పోటీపడతాయి. 'ది హిందూ బిజినెస్ లైన్'లోని రెడిఫ్యూషన్ రిపోర్ట్ ప్రకారం బీసీసీఐ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 9,741.7 కోట్ల ఆదాయాన్ని ఆర్జించగా, ఇందులో ఐపీఎల్ రూ. 5,761 కోట్లను సమకూర్చింది."2007లో బీసీసీఐ ఒక బంగారు గుడ్లు పెట్టే బాతును కనుగొంది.. అదే ఐపీఎల్. ఇది ఇప్పుడు బీసీసీఐలో 100 శాతం భాగం. ఈ టోర్నమెంట్ అత్యుత్తమమైనది. మీడియా హక్కులు నిరంతరం పెరుగుతున్నాయి. ఐపీఎల్ రంజీ ట్రోఫీ స్థాయి ఆటగాళ్లకు కూడా ఆదే అవకాశాన్ని అందిస్తోంది. ఐపీఎల్ తన వృద్ధితో పాటు లాభాలను కూడా ఆర్జిస్తోంది"అని వ్యాపార వ్యూహకర్త, స్వతంత్ర డైరెక్టర్ లాయిడ్ మథియాస్ ఈ ప్రచురణలో పేర్కొన్నారు.

కాగా, ఐపీఎల్ కాని మీడియా హక్కుల విక్రయం నుంచి, అంతర్జాతీయ టోర్నమెంట్ల బ్రాడ్‌కాస్టింగ్ హక్కులు సహా బీసీసీఐకి రూ. 361 కోట్లు వచ్చాయి. రెడిఫ్యూషన్ చీఫ్ సందీప్ గోయల్ ప్రకారం బీసీసీఐ ఇంకా తన పూర్తి ఆదాయ సామర్థ్యాన్ని సాధించలేదు. ఎందుకంటే రంజీ ట్రోఫీ భారత్‌లోని అత్యుత్తమ దేశీయ రెడ్ బాల్ టోర్నమెంట్. దీంతోపాటు దేశీయ పోటీలను వాణిజ్యీకరించడానికి అపారమైన సామర్థ్యం ఉంది. "బీసీసీఐకి రంజీ ట్రోఫీ, దులీప్ ట్రోఫీ, లేదా సీకే నాయుడు ట్రోఫీ వంటి సంప్రదాయ ఫార్మాట్‌లను వాణిజ్యీకరించి, ఐపీఎల్ యేతర ఆదాయాలను పెంచే అపారమైన సామర్థ్యం ఉంది" అని గోయల్ వివరించారు.

# నా జెర్సీ మీద పడ్డావేంటి గురు.. మరోసారి కోహ్లీ 18 నెంబర్ ధరించిన వైభవ్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ టీమిండియా స్టార్ బ్యాటర్ కోహ్లీ జెర్సీపై తెగ ఆసక్తి చూపిస్తున్నాడు. ఫార్మాట్ ఏదైనా కోహ్లీ జెర్సీ వేసుకొని సందడి చేస్తున్నాడు. ఇంగ్లాండ్ తో జరిగిన అండర్- 19 మ్యాచ్ లో తొలిసారి కోహ్లీ 18 నెంబర్ జెర్సీ వేసుకున్న వైభవ్.. తాజాగా ఇంగ్లండ్ తో అండర్%-%19 తొలి యూత్ టెస్టులోనూ 18 నెంబర్ జెర్సీ ధరించడం విశేషం. ఈ రెండు మ్యాచ్ ల్లో వైభవ్.. కోహ్లీ జెర్సీ వేసుకోవడం ఆసక్తికరంగా మారింది. కోహ్లీ మీద ఇష్టంతోనే ఈ బీహార్ 14 ఏళ్ళ కుర్రాడు ఇలా ప్రతిసారి 18 జెర్సీలో కనిపిస్తున్నాడని టాక్ వినిపిస్తుంది. వైభవ్ సూర్యవంశీ '18' నెంబర్ వేసుకోవడంపై భిన్న అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. కోహ్లీ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తాడని కొందరు కామెంట్స్ చేస్తుంటే.. మరికొందరు మాత్రం తమ ఫేవరేట్ క్రికెటర్ జెర్సీ ఎవరూ వేసుకోవడానికి వీలు లేదని నిరాశ వ్యక్తం చేస్తున్నారు. విరాట్ కోహ్లీ ఇటీవలే టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత, అతని జెర్సీని ఎవరు వేసుకోవడానికి వీలు లేదని బీసీసీఐని నెటిజన్స్ డిమాండ్ చేశారు. కొంతమంది ఎమోషనల్ కాగా.. మరికొందరు ఆగ్రహానికి గురయ్యారు. అభిమానులకు జెర్సీ నంబర్ 18 ఒక ఎమోషన్. అది వేరే వారు ధరిస్తే జీర్ణించుకోలేరు. ఇంగ్లాండ్ తో అండర్- 19 మ్యాచ్ లో భాగంగా తొలి వన్డేలో కోహ్లీ జెర్సీ ధరించి సూర్యవంశీ దుమ్ములేపాడు. ఆడింది 18 బంతులే అయినా 48 పరుగులు చేసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. ఈ 14 ఏళ్ళ కుర్రాడి ఇన్నింగ్స్ లో 3 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. ఇటీవలే ముగిసిన టెస్ట్ మ్యాచ్ లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. ప్రస్తుతం కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్ లో వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. మరోవైపు సూర్యవంశీ ఇంగ్లాండ్ తో టెస్ట్ సిరీస్ కు సిద్ధమవుతున్నాడు. మరి వైభవ్ సూర్యవంశీ 18 నెంబర్ జెర్సీని ఇప్పటివరకు కొనసాగిస్తాడో చూడాలి.

# టీ20 ఫార్మాట్‌లో ఒక్కడే 13 వేల పరుగులు.. అరుదైన లిస్ట్‌లో ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ టీ20 ఫార్మాట్ లో తన విధ్వంసాన్ని కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం ఈ ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ వైటాలిటీ టీ20 బ్లాస్ట్ లీగ్ లో లాంక్షైర్ తరపున ఆడుతున్నాడు. ఈ లీగ్ లో అద్భుత ఫామ్ లో ఉన్న బట్లర్ ఒక మైలురాయిని చేరుకున్నాడు. టీ20 క్రికెట్ లో 13000 పరుగులు పూర్తి చేసిన అరుదైన లిస్ట్ లో చేరిపోయాడు. ఇప్పటివరకు 13 వేల క్లబ్ లో ఆరుగురు ఉండగా.. తాజాగా బట్లర్ ఈ మైల్ స్టోన్ చేరుకొని ఏడో ప్లేయర్ గా అవతరించాడు. గురువారం (జూలై 17) యార్క్‌షైర్‌తో జరిగిన వైటాలిటీ టీ20 బ్లాస్ట్ మ్యాచ్‌లో భాగంగా బట్లర్ ఈ ఘనతను అందుకున్నాడు. మాజీ ఇంగ్లాండ్ ఓపెనర్ ఓపెనర్ (13814) అలెక్స్ హేల్స్ తర్వాత ఈ మైలురాయిని చేరుకున్న రెండో ఆటగాడిగా బట్లర్ నిలిచాడు. ఓవరాల్ గా ఓవరాల్ గా ఈ లిస్ట్ లో వెస్టిండీస్ సిక్సులు వీరుడు క్రిస్ గేల్ (14,562) అగ్ర స్థానంలో ఉన్నాడు. కీరన్ పొలార్డ్ (13854), అలెక్స్ హేల్స్ (13,704), షోయబ్ మాలిక్ (13,571) వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు. విరాట్ కోహ్లీ టీ20 ఫార్మాట్ లో 397 ఇన్నింగ్స్ ల్లో 13,543 పరుగులు చేసి ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం టీ20 క్రికెట్‌లో 13000ం పరుగులు చేసిన ఏకైక యాక్టివ్ క్రికెటర్ బట్లర్. 34 ఏళ్ల బట్లర్ ఈ ఏడాది తొమ్మిది యాభైకి పైగా స్కోర్లు సాధించాడు. ఇటీవలే ఐపీఎల్ లో అదరగొట్టి.. ప్రస్తుతం జరుగుతోన్న వైటాలిటీ టీ20 బ్లాస్ట్ లోనూ సత్తా చాటుతున్నాడు. బట్లర్ బ్యాటింగ్ తో యార్క్‌షైర్‌తో జరిగిన మ్యాచ్ లో లాంక్షైర్ 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన లాంక్షైర్, బట్లర్ హాఫ్ సెంచరీతో నిర్ణీత 20 ఓవర్లలో 174 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో యార్క్‌షైర్ 153 పరుగులకే పరిమితమైంది.

# అప్పుడే ఆ భామలిద్దరి మధ్య కుమ్ములాట!

మినిమల్ ర్యాప్‌లో రుహానీ శర్మ తాజా ఫోటో వైరల్‌గా మారింది







బోల్డ్ ఇన్ బ్లూమ్: జియా శంకర్ యొక్క ట్రాపికల్ చిక్ మూమెంట్

ఒకరి అవకాశాలు మరొకరు తన్నుకుపోవడం సహజం. హీరోయిన్ల మధ్య ఈ పోటీ కనిపిస్తుంటుంది. ఆ పోటీ ఇద్దరి మధ్య వేడి వాతావరణానికి దారి తీస్తుంటుంది. హీరోయిన్ల మధ్య ఈ వైరం అన్నది ప్రకృతి ధర్మం లాంటిది. అవకాశాల కోసం విరోధులైన నటీమణులు ఎంతో మంది ఉన్నారు. అప్పటి వరకూ స్నేహితులుగా కొనసాగిన వారు? ఛాన్సుల దగ్గరకొచ్చే సరికి పోటీ వాతావరణం వస్తే నువ్వెంత అంటే నువ్వెంత అనుకునే పరిస్థితి తలెత్తుతుంది. తాజాగా అస్సాం-కేరళ బ్యూటీ మధ్య ఇలాంటి వివాదమే మొదలైనట్లు కనిపిస్తుంది.'డ్రాగన్' సినిమాతో అస్సాం బ్యూటీ కయాదు లోహర్ తెలుగింట ఎంత ఫేమస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. 'డ్రాగన్' హిట్ తో నటిగా బిజీ అయింది. ఒక్కసారిగా నాలుగు సినిమాలకు సైన్ చేసింది. అందులో మూడు తమిళ సినిమాలు కాగా, ఒక మలయాళ చిత్రం. తెలుగులో కూడా అమ్మడికి మంచి అవ కాశాలు వస్తున్నాయి. స్టార్ హీరోలతోనే ఛాన్సులందుకుంటుంది. కయాదు కంటే కాస్త సీనియర్ మమితా బైజు. ఇంత వరకూ ఒక్క తెలుగు సినిమా కూడా చేయలేదు. కానీ అమ్మడికి యువతలో మంచి ఫాలోయింగ్ ఉంది.కయాదు హాట్ బ్యూటీగా ఫేమస్ అయితే? మమితా క్యూట్ బ్యూటీగా వెలుగులోకి వచ్చింది. ఇద్దరికి తెలుగులో మంచి ఫాలోయింగ్ ఉంది. ఈనేపథ్యంలో భామా మణులిద్దరి మధ్య అవకాశాల కోసం పోటీ మొదలైనట్లు కనిపిస్తుంది.

కయాదు లోహర్ కు వచ్చిన అవకాశాలన్నింటిని మమితా బైజ్ లాగేసుకుంటుం దని కోలీవుడ్ లో వార్తలొస్తున్నాయి. శింబు హీరోగా నటించనున్న ఓ చిత్రంలో అవకాశం ముందుగా కయాదు లోహర్ కు వచ్చిందిట.

కానీ చివరి నిమిషంలో ఆ ఛాన్స్ మమితానే వరించిందిట. అలాగే ధనుష్ తో మరో సినిమా విషయంలో కూడా కయాదు కు ఇలాంటి పరిస్థితే ఎదురైందని సమాచారం. ఈ రెండు కూడా కయాదు చేతి వరకూ వచ్చిన అవకాశాలేనట. సైన్ చేయడం ఒక్కటే బ్యాలెన్స్ అనుకుంటోన్న సమయంలో మమితా బైజు లాగేసుకున్నట్లు వినిపిస్తుంది. దీంతో మమితాపై కయాదు రుసరుసలాడుతోందని కోలీవుడ్ లో ప్రచారం జరుగుతోంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com